సాక్షి ప్రకాశం

శనివారం । 18 । మార్చి । 2023

I



పీడీఎఫ్‌కు ఎదురుదెబ్బ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో ఓటమి ఎరుగని పీడీఎఫ్‌కు వైఎస్సార్‌ సీపీ గట్టి షాక్‌ ఇచ్చింది. వైఎస్సార్‌ సీపీ బలపరచిన అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి విజయం సాధించారు. - IIలో..



50 కేజీల గంజాయి సీజ్‌

ఒంగోలులోని కొత్త కూరగాయల మార్కెట్‌ సమీపంలో స్కేటింగ్‌ గ్రౌండ్‌లో 50 కేజీల గంజాయిని సీజ్‌ చేశారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
29 /33

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

రేపు ముగ్గురు మంత్రులు మార్కాపురం రాక

మార్కాపురం: డాక్టర్‌ శామ్యూల్‌ జార్జ్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఈ నెల 19 జరిగే కాలేజీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, మున్సిపల్‌ శాఖ మంత్రి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ హాజరవుతున్నట్లు కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 7 గంటలకు కళాశాలలో జరిగే కార్యక్రమానికి మంత్రులతో పాటు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, ఎస్పీ మలికా గర్గ్‌, డీఎస్పీ కిషోర్‌కుమార్‌, మున్సిపల్‌ చైర్మన్‌ బాలమురళీకృష్ణ, శ్రీశైల దేవస్థాన బోర్డ్‌ మెంబర్‌ డాక్టర్‌ కనకదుర్గ, హైదరాబాద్‌ ఇన్‌కమ్‌ ట్యాక్స్‌ కమిషనర్‌ టీహెచ్‌ విజయలక్ష్మి, కళాశాల అడ్వైజర్‌ ఆదిమూలపు సతీష్‌ హాజరవుతున్నట్లు తెలిపారు.

రేపు వెన్నెలపూలు కవితా సంపుటి ఆవిష్కరణ

ఒంగోలు: ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19న స్థానిక కోర్టుసెంటర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సాయంత్రం 4 గంటలకు వెన్నెలపూలు కవితా సంపుటి ఆవిష్కరిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవితా సంపుటిని అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ యత్తపు కొండారెడ్డి ఆవిష్కరిస్తారన్నారు. చుండూరి శ్రీనివాసరావు రచించిన ఐదో కవితా సంపుటి ఆవిష్కరణకు జిల్లాలోని కవులు, రచయితలను సాదరంగా స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ నర్సింగ్‌ స్కూలు వైస్‌ ప్రిన్సిపాల్‌గా నాగమల్లేశ్వరి



ప్రభుత్వ నర్సింగ్‌ స్కూల్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగమల్లేశ్వరి

ఒంగోలు అర్బన్‌: ప్రభుత్వ నర్సింగ్‌ స్కూలు వైస్‌ ప్రిన్సిపాల్‌గా పీ నాగమల్లేశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జనరల్‌ నర్సింగ్‌ స్కూల్‌ నుంచి పదోన్నతిపై ఒంగోలు నర్సింగ్‌ స్కూలుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆమె జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ భగవాన్‌ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీడీ మంజుల, ఏడీ లక్ష్మీకుమారి, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ సంపూర్ణమ్మలను కలిశారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను నర్సింగ్‌ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంజీష్‌, ఉదయలక్ష్మి, రమణనాయక్‌, మహేష్‌, వందన, హనుమంత్‌ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏకేయూ రిజిస్ట్రార్‌గా హరిబాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న బి.హరిబాబు




వైస్‌ చాన్స్‌లర్‌తో ఆచార్య బి.హరిబాబు

ఒంగోలు: ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ) నూతన రిజిస్ట్రార్‌గా బి.హరిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మారెడ్డి అంజిరెడ్డిని కలిసి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం తన చాంబరులో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు హరిబాబు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో రసాయన శాస్త్రం విభాగంలో ఆచార్యునిగా సేవలు అందిస్తున్నారు. పీజీ ప్రవేశాల సంచాలకులుగా , లాసెట్‌ కన్వీనర్‌గా ఆయన ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హరిబాబు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో తనకు పదవి ఇచ్చినందుకు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను యూనివర్శిటీలోని అధికారులు, సిబ్బందితోపాటు స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్‌ ఎం.శ్రీనివాసరెడ్డి, చెన్నమనేని శ్రీనివాసరావు , పలువురు కాలేజీల ప్రిన్సిపాళ్లు కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు.

ఇక.. వడివడిగా

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయానికి మహర్దశ పట్టింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పెండింగ్‌ ప్రాజెక్ట్‌లకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేస్తోంది. ఈ క్రమంలోనే తాజా బడ్జెట్లో ఏకంగా రూ.50 కోట్లు కేటాయించింది. రైతులకు, సాగు, ప్రజలకు తాగునీరు పుష్కలంగా అందించాలన్న దీర్ఘకాలిక ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- గుండ్లకమ్మకు మహర్దశ
- ప్రాజెక్టు అభివృద్ధికి వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం చర్యలు
- టీడీపీ ఐదేళ్ల కాలంలో మొక్కుబడిగా నిధుల విదిలింపు
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏకంగా రూ.50 కోట్ల నిధులు కేటాయింపు
- ప్రాజెక్ట్‌ ఆధునికీకరణకు ప్రణాళికలు సిద్ధం



కందుల ఓబుల రెడ్డి గుండ్లకమ్మ జలాశయం స్పిల్‌వే

మద్దిపాడు: జిల్లాలో కీలకంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల్లో కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయం ఒకటి. కరువుకు కేరాఫ్‌ అడ్రస్‌గా ఉన్న ప్రకాశం జిల్లాలో రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్ట్‌ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2004లో డ్యామ్‌ నిర్మాణం ప్రారంభించి కేవలం నాలుగేళ్లలో పూర్తి చేసి 2008లో జాతికి అంకితం చేశారు. రిజర్వాయర్‌ పరిధిలో 80,060 ఎకరాలు ఆయకట్టు స్థిరీకరించారు. 3.859 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యంలో నిర్మించిన రిజర్వాయర్‌ ద్వారా ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూరింది.

గతంలో టీడీపీ అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లు కనీసం ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించాలనే ఊసే లేదు. ఆ తర్వాత కాలంలో వైఎస్సార్‌ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించినా.. విస్తరణ, అభివృద్ధి, ఆధునికీకరణ వంటి పనులను చేపట్టడంలో మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ చిన్నచూపు చూసింది. ఐదేళ్లలో జలాశయం నిర్వహణకు ఏటా బడ్జెట్‌లో కేవలం రూ.లక్షల్లోనే నిధులు కేటాయించేది. ఈ ప్రాజెక్ట్‌ ప్రాధాన్యతను గుర్తించిన వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. తాజా బడ్జెట్‌లో ఏకంగా రూ.50 కోట్ల నిధులు కేటాయించింది.

రిజర్వాయర్‌ ఆధునికీకరణ

నాగులుప్పలపాడు మండలం ఒంగోలు రూరల్‌ మండలంలోని పలు గ్రామాల రైతులకు ఈ రిజర్వాయర్‌ వలన మేలు చేకూరడంతో ఆయా ప్రాంతాల రైతులు వరి, పత్తి, మిరప, పొగాకు, శనగ, మొక్కజొన్న తదితర పంటలతోపాటు పశువుల మేతకు జొన్న పుష్కలంగా పండించుకుంటున్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మూడేళ్లుగా రిజర్వాయర్‌కు భారీగా నీళ్లు చేరాయి. దీంతో మూడో గేటు దెబ్బతిని నీరు వృథా అయింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తక్షణ మరమ్మతులు చేయాలని ఆదేశించింది. మూడో గేటు స్థానంలో స్టాప్‌లాక్‌లు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టి నిల్వ చేశారు. తాజా బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.50 కోట్లు కేటాయించడంతో రిజర్వాయర్‌ పూర్తి స్థాయిలో ఆధునికీకరణకు నోచుకునే అవకాశం ఏర్పడింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కేవలం రిజర్వాయర్‌కు మొక్కుబడిగా నిధులు ఇచ్చింది. 2013–14 రూ.9.98 లక్షలు, 2014–15 రూ.41.61 లక్షలు, 2015–16 రూ.111.79 లక్షలు, 2016–17 రూ.49.63 లక్షలు నిధులిచ్చింది. వీటిని రిజర్వాయర్‌ మెయింటెనెన్స్‌కు వినియోగించాల్సి ఉంది. అయితే అప్పటి దేశం నేతలు రిజర్వాయర్‌ సుందరీకరణ పేరుతో నిధులు మింగేశారు. కనీస మెయింటెనెన్స్‌ చేయకపోవడంతో రిజర్వాయర్‌ గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. రైతులను ఆదుకునేందుకు దివంగత సీఎం వైఎస్సార్‌ అన్నిరకాలుగా చర్యలు చేపడితే అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేసిన టీడీపీ గేట్లు పాడైన అంశాన్ని ప్రస్తుత ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసింది. ఎల్లోమీడియా సైతం వాస్తవాలను దాచి అసత్య ప్రచారానికి దిగింది. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ రీజినల్‌ కో–ఆర్డినేటర్‌, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జిల్లా నేతల కృషి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రాజెక్టు ఆధునికీకరణకు ఏకంగా రూ.50 కోట్లు కేటాయించింది.



దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఆవిష్కరించిన పైలాన్‌

ఆధునికీకరణ ఇలా..

ఈ బడ్జెట్‌లో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేటాయించిన రూ.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా కుడి, ఎడమ ప్రధాన కాలువలను ఆధునికీకరించడంతో పాటు రిజర్వాయర్‌ 12 గేట్ల మరమ్మతులు చేసేందుకు రూ.9.40 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. కోటి రూపాయలతో కుడికాల్వ జంగిల్‌ క్లియరెన్స్‌ సిల్ట్‌ తొలగించే పనులు, కుడికాలువ ఒక కిలోమీటర్‌ వరకూ లైనింగ్‌ వేయడానికి రూ.4 కోట్లతో అంచనాలు తయారు చేశారు. వీటితో పాటు ఎడమకాలువలో మిగిలిపోయిన 7 కిలో మీటర్ల మేర కాలువలు తవ్వించడానికి రూ.19 కోట్లు ఖర్చు చేయనున్నారు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు కూడా నీరు అందించేందించేలా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్‌ ద్వారా రైతులకు మరింత మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం స్పష్టంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహనరెడ్డి రైతు పక్షపాతి అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి ఉంటుందని స్థానిక ప్రజలు అంటున్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: నిరక్షరాస్యత నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్లో లేవనెత్తిన అంశానికి కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి డాక్టర్‌ అన్నపూర్ణాదేవి సమాధానమిచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ నిరక్షరాస్యత రేటు 72.98 శాతం ఉందని, ఏపీలో 67.02 శాతం ఉందని అన్నారు. జాతీయ విద్యా మిషన్‌ కింద సాక్షర భారత్‌, సమగ్రశిక్ష అనే రెండు పథకాలు అమలులో ఉన్నట్లు వివరించారు. దేశంలో వయోజనుల కోసం ముఖ్యంగా మహిళలు, వెనుకబడిన గ్రూపులపై ప్రత్యేక శ్రద్ధతో 26 రాష్ట్రాలలో, 404 జిల్లాల్లో సాక్షర భారత్‌ పథకాన్ని ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. 2010 నుంచి 2018 వరకు 7 కోట్ల మంది వయోజనులు లక్ష్యం కాగా, నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఓపెన్‌ స్కూలింగ్‌ నిర్వహించిన పరీక్షల్లో 7.64 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. సమగ్ర శిక్ష పథకం కింద 2021 ఏప్రిల్‌ 1 మొదలు 2026 మార్చి 31 వరకు అమలులో ఉంటుందని, దీని కింద 1 నుంచి 12 తరగతుల వరకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని అన్నారు.

ఇందుకు జాతీయ పాలసీ సిఫార్సులు, ఉచిత నిర్బంధ విద్య అమలు, సంరక్షణ, చదువుపై దృష్టి, విద్యపై నమ్మకం కల్పన, నాణ్యమైన విద్యా కల్పన, సామాజిక లింగ అంతరాలపై భేదాభిప్రాయాల తొలగింపు, సమానత్వంపై భరోసా, రాష్ట్రాల విద్యాసంస్థల బలోపేతం, అభ్యాసానికి అనుకూల వాతావరణ కల్పనకు సంబంధించి కార్యకలాపాల నిర్వహణకు రాష్ట్రాలకు కేంద్రం ఆర్థికసాయం అందిస్తున్నట్లు వివరించారు. ఏపీ రాష్ట్రానికి రూ.9,48,280 లక్షలు మంజూరు కాగా, అందులో రూ.8,90,295 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. సాక్షర భారత్‌ కింద 53.03 లక్షల మంది లబ్ధిపొందగా సమగ్రశిక్ష పథకం కింద 49.07 లక్షల మంది లబ్ధిపొందినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి డాక్టర్‌ అన్నపూర్ణాదేవి తెలిపారు.

దొనకొండలో కలెక్టర్‌ సుడిగాలి పర్యటన



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

దొనకొండ: మండలంలో కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. బాదాపురం, చందవరం గ్రామాల్లో జగనన్న కాలనీలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ ముఖాముఖిగా మాట్లాడారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆయన దొనకొండలో పర్యటించి ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీ చేశారు. మండలంలో ఎంతమంది లబ్ధిదారులకు జగనన్న కాలనీలు మంజూరయ్యాయని, వాటిలో ఎంత మంది పూర్తి చేశారని, మిగిలినవి ఏ స్టేజీలో ఉన్నాయని హౌసింగ్‌ సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేయాలని, లబ్ధిదారులు వలసలకు వెళ్తే వారిని పిలిపించి అవగాహన కల్పించాలన్నారు. ఇసుక, స్టీలు అందుబాటులో ఉన్నాయని, లబ్ధిదారులు ముందుకొచ్చి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ:

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్‌ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నాడు–నేడు కార్యక్రమం కింద నిర్మిస్తున్న తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. డ్రాపౌట్స్‌ ఎంత మంది ఉన్నారు తదితర విషయాలను హెచ్‌ఎం రామాంజనేయులును అడిగి తెలుసుకున్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను కలెక్టర్‌ పరిశీలించారు. తరగతి గదిలో ప్రీ ఫైనల్‌ రాస్తున్న విద్యార్థుల ఆన్సర్‌ షీట్‌ను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడి బాలికలు డల్‌గా ఉన్నారని, పదో తరగతి పరీక్షలు 15 రోజులు ఉన్నాయని వారిపై శ్రద్ధ చూపించి నూరు శాతం ఉత్తీర్ణులయ్యేలా చూడాల్సిన బాధ్యత మీదే అన్నారు. విద్యార్థులు తప్పులు లేకుండా రాయాలని, విద్యార్థులు ఫెయిలైతే మీరే బాధ్యులని ఉపాధ్యాయులను కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ హెచ్చరించారు. స్థానిక సచివాలయం–1ను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు ఏ విధంగా సమస్యలు పరిష్కరిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సచివాలయం పరిధిలో ఎంతమంది ఆడ పిల్లలు ఉన్నారో గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, కనీసం ప్లస్‌ 2 చదివించాలని సూచించారు. భూ సర్వే ఎంత వరకు చేశారని, ఎన్ని గ్రామాల్లో పూర్తయిందని, మండలంలో డ్రోన్‌లు ఎన్ని ఉన్నాయని సచివాలయం సర్వేయర్లతో మాట్లాడి కలెక్టర్‌ తెలుసుకున్నారు. ఎవరి పరిధిలో వారు రీ సర్వే పూర్తి చేయాలని సూచించారు. మళ్లీ దొనకొండలో తన పర్యటన ఉంటుందని, కచ్చిత సమాచారం, భూ సర్వే తమకు తెలియజేయాలని కలెక్టర్‌ ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, స్థానిక సర్పంచ్‌ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్‌, డీపీఓ జీవీ నారాయణరెడ్డి, తహసీల్దార్‌ కాలే వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్‌, ఎంఈఓ ఎస్‌.సాంబశివరావు పాల్గొన్నారు.



జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న కలెక్టర్‌

ఉరకలెత్తించిన ఒంగోలు గిత్తలు



బండ లాగేందుకు ఉరకలేస్తున్న కోడె గిత్తలు

- ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వెలుగొండ క్షేత్రంలో రాష్ట్ర స్థాయి సీనియర్‌ విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఒంగోలు గిత్తలు రంకెలేస్తూ ప్రజలను ఉత్సాహపరిచాయి. మేకలవారిపల్లి రెడ్ల సంఘం పర్యవేక్షణలో నిర్వహించిన ఎడ్ల పోటీలను ఆలయ కమిటీ చైర్మన్‌ సానికొమ్ము తిరుపతిరెడ్డి ప్రారంభించారు. సేద్యపు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రకాశం, గుంటూరు, నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి తొమ్మిది జతల ఎడ్లు పోటీలో తలపడ్డాయి. బండ లాగుడు ప్రదర్శనలో నువ్వా, నేనా అన్న రీతిలో ఒంగోలు గిత్తలు రాజసం ఒలకబోస్తుంటే చూడటానికి జనం ఆసక్తిచూపారు. రిఫరీగా వెంకటరామిరెడ్డి, వెంకటరెడ్డి, బ్రహ్మారెడ్డి వ్యవహరించారు.

నంద్యాల ఎడ్ల జతకు మొదటి బహుమతి:

సీనియర్‌ విభాగంలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పందేల్లో నంద్యాలకు చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి ఎడ్లజత నిర్ణీత 20 నిముషాల్లో 3088 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించుకున్నాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగ కాశయ్య ఎడ్ల జత 3067 అడుగులు లాగి రెండవ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగశివశంకర్‌ ఎడ్ల జత 2802 అడుగులు లాగి మూడో స్థానం సాధించాయి. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్ల జత 2756 అడుగులు లాగి నాలుగో స్థానం దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం సుంకేసులకు చెందిన ముద్దపాటి శ్రీనివాసులు ఎడ్ల జత 2715 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం కస్పూతలకు చెందిన ఎడ్ల జత 2420 అడుగులు లాగి ఆరో స్థానం సాధించాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు ఆలయ కమిటీ చైర్మన్‌ తిరుపతిరెడ్డి, ఈఓ చెన్నకేశవరెడ్డి, దాతల సహకారంతో అందజేసిన నగదును వరుసగా ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు బహుమతులను రూ.50 వేలు, రూ.30, రూ.20, రూ.15, రూ.10, రూ.5 వేలను ఎడ్ల యజమానులకు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న దాతలు

కన్నుల పండువగా గోవిందుని రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



భక్తులకు దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు



వైఎస్సార్‌ సీపీ అభిమానులు ఏర్పాటు చేసిన విద్యుత్‌ ప్రభ

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి నిర్వహించిన రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. గోవింద నామస్మరణలతో వెలుగొండ మారుమోగింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాల నడుమ భక్త జయజయధ్వానాలు చేస్తుండగా ఊరేగింపు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మహిళలు ఉత్సాహంతో శ్రీవారి రథాన్ని లాగారు. వేద పండితులు ప్రసాదాచార్యులు, పవన్‌ కుమార్‌శర్మ, స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఉభయ దాతలు హోమాలు, అర్చనలు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవానికి ఉభయదాతలుగా గార్లదిన్నె గ్రామస్తులు, దేవస్థాన కమిటీ వ్యవహరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్‌ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:

తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విద్యుత్‌ ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాట కచేరీలతో పాటు చెంచులక్ష్మి, బ్రహ్మంగారి నాటకం, మహిళల కోలాట భజనలు, బొల్లావుల ఉత్సవం భక్తులను ఆకట్టుకున్నాయి. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొదిలి సీఐ సుధాకరరావు పర్యవేక్షణలో, కొనకనమిట్ల ఎస్సై కడలి దీపిక ఆధ్వర్యంలో పోలీస్‌ బందోబస్తు నిర్వహించారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్‌: గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం వెంకటేశ్వర కాలనీలోని యూపీహెచ్‌సీ (అర్బన్‌ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం)ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్లకు, ఇతర వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణుల పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌ చేయడంతో పాటు వారికి ఇవ్వాల్సి ఐరన్‌ మాత్రలు క్రమం తప్పకుండా అందచేస్తూ ఆరోగ్య స్థితిగతులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. మాతృ , శిశు సేవలను ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్‌ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సమస్యాత్మక గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జన్మించిన శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. దీనిలో డాక్టర్‌ అభిజ్ఞ చంద్రిక ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటేశ్వర కాలనీలో యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి

క్లుప్తంగా

అనుమతి లేని ఎరువుల విక్రయం నిలిపివేత



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

యర్రగొండపాలెం: ఎరువుల దుకాణాల్లో ఓ-ఫారం లైసెన్స్‌లో పొందుపరచని పురుగు మందులు, ఎరువుల విక్రయాన్ని అధికారులు తాత్కాలికంగా నిలిపేశారు. శుక్రవారం వ్యవసాయశాఖ అంతర్గత తనిఖీ బృందం వైపాలెంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా దాదాపు రూ.2.40 లక్షల విలువ చేసే ఎరువుల వివరాలు ఓ-ఫారం లైసెన్స్‌లలో పొందుపరచలేదని గుర్తించారు. ఆయా ఎరువుల విక్రయాన్ని నిలిపివేయాలని డీలర్లను ఆదేశించారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, లేదంటే దుకాణం లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తనిఖీ బృందం అధికారి రమాదేవి హెచ్చరించారు. మార్కాపురం టెక్నికల్ అధికారి చంద్రశేఖర్, ఏవోలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, సుధీర్ బాబు ఉన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై దాసరి ప్రసాద్

కనిగిరి రూరల్: మోటార్ సైకిల్ ఢీ కొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని దేవాంగ నగర్ వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దేవాంగనగర్‌కు చెందిన వట్టివేళ్ల శ్రీరంగం రోడ్డు దాటుతుండగా.. కనిగిరి నుంచి పొదిలి వైపు వేగంగా వెళ్తున్న మోటార్ బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో శ్రీరంగం తలకు, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. కుమారుడు అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై దాసరి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు కొణిజేడు విద్యార్థి



మహబూబ్ అజీష్

టంగుటూరు: అంతర్జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు టంగుటూరు మండలంలోని కొణిజేడు గ్రామానికి చెందిన వేమూరి మహబూబ్ అజీజ్ ఎంపికయ్యాడు. ఒంగోలులోని శ్రీసరస్వతి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ సెకండియర్ చదువుతున్న అజీజ్ గత ఏడాది డిసెంబర్ 26 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని తాంబరంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాడు. ఈ ఏడాది జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు బంగ్లాదేశ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీల్లో భారత జట్టు తరఫున అజీజ్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. కుటుంబ సభ్యులు, కాలేజీ యాజమాన్యం ప్రోత్సాహం మరువలేనని అజీజ్ పేర్కొన్నాడు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి

ఒంగోలు: కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద పంట రుణాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో శుక్రవారం నిర్వహించిన కౌలు రైతుల జిల్లా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వాలు గుర్తింపు కార్డులు ఇవ్వడంలేదన్నారు. రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్లో 4.75 లక్షల మంది గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులలో కేవలం 1.50 లక్షలమంది రైతులకు మాత్రమే రుణాలిచ్చారని చెప్పారు. కౌలు రైతులు ప్రోత్సాహకాలు అందుకునేలా చట్టానికి సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై ఈనెల 28న విజయవాడలోని హనుమాన్ పేటలోని దాసరి భవనంలో కౌలు రైతుల రాష్ట్ర సదస్సులో రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.హనుమారెడ్డి పాల్గొన్నారు.

పీడీఎఫ్‌కు ఎదురుదెబ్బ

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాజయం
- మట్టికరిపించిన వైఎస్సార్‌సీపీ
- వామపక్ష విధానాలకు తిలోదకాలొదిలిన సీపీఎం, సీపీఐ
- టీడీపీతో చేతులు కలిపినా వరించని విజయం
- ప్రతి రౌండ్‌లోనూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థికి ఆధిక్యం

ఏ ఎండకాగొడుగు పడుతూ సిద్ధాంతాలను తుంగలో తొక్కిన వామపక్షాలకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని వైఎస్సార్ సీపీని ఓడించాలని వామపక్షాలు పన్నిన కుట్రలు, కుతంత్రాలు పటాపంచెలు అయ్యాయి. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయాన్ని కట్టడి చేయలేక కమ్యూనిస్టులు చేతులెత్తేశారు.



రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నుంచి డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న పర్వతరెడ్డి

సాక్షి, తిరుపతి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో ఓటమి ఎరుగని పీడీఎఫ్‌కు వైఎస్సార్ సీపీ గట్టి షాక్ ఇచ్చింది. మొదటి సారిగా పీడీఎఫ్‌కు ఓటమిని రుచిచూపించింది. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఘన విజయం సాధించారు. ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు- చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ప్రజల్లో ఉన్న మద్దతును దృష్టిలో ఉంచుకుని ఓటమి తప్పదని భావించింది. వామపక్ష భావాలకు విరుద్ధంగా సీపీఎం, సీపీఐ నాయకులు టీడీపీతో పొత్తుపెట్టుకుని నానాతంటాలు పడ్డారు. టీడీపీ పొత్తుతో పీడీఎఫ్ అభ్యర్థికి ఎన్నోకొన్ని ఓట్లు వస్తాయని భావించాయి. అందులో భాగంగా టీడీపీతో కలిసి ఎన్నికలకు ముందు నుంచి నానారభస చేశారు. నిజమైన ఓటర్లను సైతం దొంగ ఓటర్లుగా చిత్రీకరించి భయభ్రాంతులకు గురిచేశారు. ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

విజయ్యశేఖరుడు

చిత్తూరు ఎస్వీ సెట్‌లో గురువారం నిర్వహించిన కౌంటింగ్‌లో పీడీఎఫ్ అభ్యర్థి ఏ ఒక్క రౌండ్‌లోనూ మెజారిటీ సాధించలేకపోయారు. మొదటి రౌండ్ నుంచి రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపు వరకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. శుక్రవారం వేకువజాము వరకు ఉత్కంఠంగా సాగిన కౌంటింగ్‌లో పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి విజయఢంకా మోగించారు.

పీడీఎఫ్‌కు తొలి ఓటమి

పీడీఎఫ్‌కు మొదటి సారి ఓటమి ఎదురైంది. 1985లో అప్పటి సీఎం ఎన్టీ రామారావు శాసనమండలి వ్యవస్థను రద్దు చేశారు. ఆ తర్వాత 2007లో దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి తిరిగి శాసనమండలి వ్యవస్థను పునరుద్ధరించారు. అప్పటి నుంచి మూడు సార్లు మండలి ఎన్నికలు నిర్వహించారు. 2007లో పీడీఎఫ్ అభ్యర్థి దాచూరి రామిరెడ్డి టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2011-2017, 2017-2023 వరకు పీడీఎఫ్ అభ్యర్థి విఠపు బాలసుబ్రహ్మణ్యం టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. గత 16 ఏళ్లుగా టీచర్ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుంటున్న పీడీఎఫ్‌కు మొదటిసారి ఎదురుదెబ్బ తగిలింది.

మిన్నెకల్లు గ్రామ ప్రజలు ధన్యులు



కల్యాణ మంటపాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్

- శృంగేరీ పీఠాధిపతి మాత స్మారక కల్యాణ మండపం ప్రారంభం
- ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్



ప్రత్యేక పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

అద్దంకి: శృంగేరి శారదా పీఠాధిపతి భారతీతీర్థ స్వామి మాతృమూర్తికి జన్మనిచ్చిన మిన్నెకల్లు గ్రామ ప్రజలు ధన్యులని హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్ అన్నారు. శృంగేరీ శారదా పీఠాధిపతి భారతీతీర్థ స్వామి మాతృమూర్తి తంగిరాల అనంతలక్ష్మమ్మ జన్మగ్రామం సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లులో ఆమె పేరిట స్మారక కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ మంటప నిర్మాణానికి గొరిజవోలు కోటేశ్వరరావు, పంగులూరి మస్తాన్‌రావు స్థలాన్ని దానం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా దైవభక్తి కలిగి ఉండాలన్నారు. దైవ భక్తితో శాంతి సౌఖ్యాలు కలుగుతాయని చెప్పారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తరువాత 15వ వేదసభను తంగిరాల దక్షిణామూర్తి నిర్వహించారు. బొల్లినేని రామకృష్ణ, గాడిపర్తి లక్ష్మీనారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శారదాపీఠం నుంచి వచ్చిన ఈవో వీఆర్ గౌరీ శంకర్, స్థానిక నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్గదర్శి సిబ్బంది ముందస్తు బెయిల్ పిటిషన్

ఒంగోలు: మార్గదర్శి సంస్థల్లో పనిచేస్తున్న ముగ్గురు మేనేజర్లు, ఇద్దరు అకౌంటెంట్లు దాఖలు చేసిన మధ్యంతర ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఈనెల 20వ తేదీకి వాయిదా పడింది. ఒంగోలు మార్గదర్శి బ్రాంచి మేనేజర్లుగా పనిచేస్తున్న కరణం నాగేశ్వరరావు, ఆరెకొండ సాంబ శ్రీను, అకౌంటెంట్ మద్దినేని కోటేశ్వరరావు, చీరాల బ్రాంచి మేనేజర్ గుమ్మడపు సురేంద్ర, అకౌంటెంట్ బూదాటి శ్రీనివాసులు జిల్లా కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై సీఐడీ విభాగం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొల్లా నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ ఇప్పటి వరకు ఒంగోలు, చీరాల మార్గదర్శి బ్రాంచీలపైకాని, సిబ్బందిపైన ఎటువంటి కేసులు నమోదు కాలేదన్నారు. అందువల్ల ఈ కేసులో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. దీంతో కేసు విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేశారు. అనంతరం మార్గదర్శి సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది మధ్యంతర ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక మార్గదర్శి సంస్థల్లో సీఐడీ దాడులు, అరెస్టులు కొనసాగుతున్న నేపథ్యంలో మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని డిఫెన్స్ లాయర్ కరువది రాఘవరావు వాదించారు. ఏం నేరం చేశారు, ఏ నేరం ఆరోపించబడిందో కూడా తెలియనప్పుడు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని సీఐడీ విభాగం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొల్లా నాగేశ్వరరావు వాదించారు. వాదనలు శుక్రవారం ముగియగా తీర్పును రిజర్వు చేస్తూ ఈనెల 20వ తేదీకి జడ్జి వాయిదా వేశారు.


ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి చీరాల వాసికి పీహెచ్‌డీ



తేజను అభినందిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: ఐఐటీ ఖరగ్‌పూర్ ఐఐటీ యూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో 'స్పార్స్ ఆల్గోరిజం ఫర్ ఈఈజీ సోర్స్ లోకలైజేషన్'పై అధ్యయనం చేసిన చీరాల కొత్తపేటకు చెందిన మన్నేపల్లి తేజకు ఇంటర్నేషనల్ జర్నల్ ప్రచురితం కావడంతో పీహెచ్‌డీ ప్రదానం చేసింది. శుక్రవారం తేజ, అతని తల్లిదండ్రులు విశ్రాంత ప్రిన్సిపాల్ మన్నేపల్లి బ్రహ్మయ్య దంపతులు చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. అమెరికా దేశం హూస్టన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ హెల్త్‌లో పోస్ట్ డాక్టోరల్ చేసేందుకు అవకాశం కల్పించడంతో పాటు వర్కింగ్ వీసాను అందించడంతో తేజను ఎమ్మెల్యే కరణం సత్కరించి అభినందించారు. ఈఈజీ ద్వారా బ్రెయిన్ నుంచి వచ్చే సిగ్నల్స్, బ్రెయిన్ పనితీరుతో పాటు బ్రెయిన్ ట్యూమర్ రాకుండా తీసుకోవాల్సిన పలు అంశాలపై ప్రొఫెసర్ అరవింద రాత్రే పర్యవేక్షణలో పీహెచ్‌డీ పొంది హూస్టన్ యూనివర్సిటీలో సీటు సాధించడాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. విద్యతోనే ఉన్నత స్థానంలో నిలుస్తారనే మన్నేపల్లి తేజ నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, ప్రముఖ వైద్యులు గోరంట్ల సుబ్బారావు, గోరంట్ల కిరణ్‌లు స్కాలర్ తేజను అభినందించారు. వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బాల సుబ్బారావు, మేజర్ తోట రోశయ్య, అధ్యాపకులు రాధాకృష్ణమూర్తి, సుబ్బారావు, భూపేంద్రలు అభినందించారు.

చందవరం బౌద్ధ స్థూపాలను సందర్శించిన కలెక్టర్



బౌద్ధ స్థూపాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

దొనకొండ: మండలంలోని చందవరం సమీపంలో గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న బౌద్ధ స్థూపాలను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అధికారులతో కలిసి కొండపైకి వెళ్లారు. అక్కడ ఉన్న బౌద్ధ స్థూపాలను పరిశీలించారు. వాటి విశిష్టతను గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు రావటానికి ఎలాంటి సౌకర్యం లేదని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరారు. అనంతరం చందవరం గ్రామంలోని డంపింగ్ యార్డును పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ వజ్రగిరి రాణి సాలోమన్, డీపీఓ జీవీ నారాయణరెడ్డి, డీపీఆర్ఓ దుర్గాప్రసాద్, తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వసంతరావునాయక్ ఉన్నారు

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



మృతిచెందిన జాలిరెడ్డి

కొత్తపట్నం: వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ సముద్రంలో కాలు జారిపడి మృతిచెందిన సంఘటన కొత్తపట్నం మండలంలోని మడనూరు గ్రామం వద్ద శుక్రవారం జరిగింది. బీరంగుంట గ్రామానికి చెందిన గుండుబోయిన జాలిరెడ్డి (40) గురువారం సాయంత్రం మరో ఇద్దరు మత్స్యకారులు సింగోతు రమేష్, గుండుబోయిన నాగరాజుతో కలిసి చేపల వేటకు వెళ్లాడు. గుండమాల రేవు నుంచి సముద్రంలోకి వేటకు వెళ్తుండగా, మడనూరు గ్రామం తీరం ఎదురుకు వచ్చేసరికి వల లాగుతూ ప్రమాదశావత్తూ కాలు జారి సముద్రంలో పడ్డాడు. బోటులో ఉన్న ఇద్దరు మత్స్యకారులు జాలిరెడ్డి కోసం వలతో గాలింపు చర్యలు చేపట్టి గుర్తించి అతి కష్టంమీద బయటకు లాగి ఒడ్డుకు చేర్చారు. 108కు ఫోన్‌చేసిన పది నిమిషాలకే తీరానికి చేరుకుంది. సిబ్బంది పరీక్షలు చేసి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి మృతదేహాన్ని తరలించారు. ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాల్య వివాహం నిలిపివేత



బాల్యవివాహాన్ని నిలిపివేసి నోటీసులు ఇస్తున్న అధికారులు

మద్దిపాడు: మండలంలోని బూరేపల్లి పునరావాసకాలనీలో శుక్రవారం జరుగుతున్న బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. బూరేపల్లి గ్రామానికి చెందిన యువకునికి మైనార్టీ తీరని తాళ్లూరుకు చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. ఆ యువతికి మైనార్టీ తీరలేదంటూ సమాచారం అందడంతో ఐసీడీఎస్ సీడీపీవో ఇమాంజనేయులు ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ శైలజ మద్దిపాడు ఏఎస్సై వెంకటలక్ష్మి సహాయం తీసుకుని బూరేపల్లి వెళ్లారు. పెండ్లికుమారుని తండ్రిని కలిసి అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపివేశారు. మైనార్టీ తీరని యువతికి పెండ్లి చేయడం చట్టవిరుద్ధమని వారికి తెలియజేసి నోటీసులు ఇచ్చారు. యువకునితో పాటు అతని తండ్రి వద్ద వివాహ రద్దు అంగీకారపత్రం రాయించుకున్నారు. అధికారుల వెంట గ్రామ కార్యదర్శి అజయ్‌కీర్తి, వీఆర్వో రాంబాబు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి నాగలక్ష్మి, ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు ఉన్నారు.

నగరేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు



సూర్యకిరణాలు తాకిన దృశ్యం

అద్దంకి రూరల్: అద్దంకిలోని పురాతన శివాలయం వేయిస్తంభాలతో నిర్మించబడిన గంగావింధ్యావాసిని సమేత నగరేశ్వస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం 7.15 గంటలకు స్వామివారిపై సూర్యకిరణాలు ప్రసరించాయి. ఈ దృశ్యాన్ని భక్తులు దర్శించుకుని స్వామివారికి పూజలు నిర్వహించారు.

50 కేజీల గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఈబీ సీఐ లత, సీజ్ చేసిన గంజాయి

ఒంగోలు: స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలోని స్కేటింగ్ గ్రౌండులో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఒంగోలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ లత తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అన్నవరప్పాడులోని స్టేషన్ ఆవరణలో సీజ్‌చేసిన 50 కేజీల గంజాయిని మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్పీ మలికాగర్గ్, ఎస్ఈబీ జేడీ నాగేశ్వరరావు నుంచి అందిన సమాచారం మేరకు సిబ్బందితో నిఘా పెట్టామన్నారు. అనకాపల్లి రావికమతంకు చెందిన చందకా సన్యాసినాయుడు 50 కేజీల గంజాయిని రైలులో ఒంగోలు తీసుకొచ్చి ఒంగోలు, చీమకుర్తి, పొదిలిలో కొంతమందికి 22 కేజీల గంజాయి విక్రయించాడని వెల్లడించారు. ఇంకా అతని వద్ద 28 కేజీల గంజాయి మిగిలి ఉండటంతో దానిని ఒంగోలుకు చెందిన వల్లెపు ప్రసాద్, ఉలవపాడుకు చెందిన వాయల రఘురామయ్య, కందుకూరుకు చెందిన పాలకీర్తి రమణయ్యలకు ఒక్కొక్కరికి రెండు కేజీల ప్యాకెట్ల చొప్పున విక్రయించడం జరిగిందన్నారు. సమాచారం అందడంతో మొత్తం గంజాయితో పాటు నిందితులను పట్టుకుని వారు గంజాయి రవాణాకు వినియోగించిన మోటారు బైకును సీజ్ చేశామన్నారు. గంజాయి మార్కెట్ విలువ రూ.4.20 లక్షలు ఉంటుందని, గంజాయి సరఫరాదారుడు, కొనుగోలు చేసిన ఏడుగురు వ్యక్తులను గుర్తించామని తెలిపారు. త్వరలోనే మిగిలిన వారిని కూడా అరెస్టు చేస్తామన్నారు. ఈ దాడిలో సెబ్ ఎస్సై గోపాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, వెంగముక్కల పంచాయతీ కార్యదర్శి శంకర్, వీఆర్వో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి అభినందనలు

ఒంగోలు: తూర్పురాయలసీమ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌కే చిన్నప్ప, సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి సూచనల మేరకు చంద్రశేఖరరెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఆయన గెలుపులో భాగస్వాములు అయిన ఎయిడెడ్ సోదరుల తరఫున చంద్రశేఖర్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్, జేసీబీ పట్టివేత

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి సమీపంలో శుక్రవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, జేసీబీని ఎస్ఈబీ ఎస్సై నగేష్ పట్టుకుని సీజ్ చేశారు. వాటిని మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సమతానగర్ సచివాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్

ఒంగోలు: స్థానిక సమతానగర్ సచివాలయాన్ని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వసూలు కావాల్సిన ఇంటి పన్ను, పేరుకుపోయిన బకాయిలు తదితరాలను పరిశీలించారు. ఇంకా రూ.9.50 లక్షలు వసూలు కావాల్సి ఉన్న దృష్ట్యా వేగవంతంగా పన్ను వసూలుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఇంటిపన్ను, ఖాళీ స్థలాల బకాయిలకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న వడ్డీ మొత్తాన్ని మాఫీ చేస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క గృహ యజమాని సద్వినియోగం చేసుకునేలా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు.

నేడు సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాలు

ఒంగోలు: స్థానిక కేశవస్వామిపేటలో గల శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉప ఆలయంగా ఉన్న శ్రీసత్యన్నారాయణస్వామి దేవస్థానంలో శనివారం సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రత కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఈదుపల్లి గురునాథం, ఈవో రజని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, భక్తులు పాల్గొని జయప్రదం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు వంటపాత్రల అందజేత



సామగ్రి అందజేస్తున్న దాత

నాగులుప్పలపాడు: అమ్మమ్మ, తాతయ్యల జ్ఞాపకార్థం చిన్నారుల శ్రేయస్సు కోసం అంగన్‌వాడీ కేంద్రానికి వంటపాత్రలు, ప్లేట్లు, గ్లాసులు అందజేయడం చాలా సంతోషంగా ఉందని దాత బండి లక్ష్మణరావు అన్నారు. ఉప్పుగుండూరులోని 6వ నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో గుద్దంటి లక్ష్మయ్య, శేషమ్మల జ్ఞాపకార్థం మనుమడు బండి లక్ష్మణరావు, శ్రీనివాసరావులు సూపర్‌వైజర్ కొల్లా శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త కొప్పోలు వెంకటరమణలకు వాటిని అందజేశారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మార్టూరు: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని చిమ్మిరిబండ గ్రామం సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన పీ స్తుతిరాజు, సీహెచ్ సరోజినిబాబులు ద్విచక్రవాహనంపై సమీపంలోని ఎన్ఎస్‌పీ కెనాల్ వైపు బహిర్భూమికి వెళ్లారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి ఇద్దరు మార్జిన్‌లో పడి పోయారు. 108 సిబ్బంది ఇరువురిని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఆటల పోటీలు శుభపరిణామం

● నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు



వాలీబాల్ మ్యాచ్‌లో తలపడుతున్న కరవది-ఒంగోలు పేస్ కాలేజీ జట్లు

ఒంగోలు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. బాలినేని వెంకటేశ్వరరెడ్డి, రమాదేవి చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఒంగోలు లయన్స్ క్లబ్ ఆఫ్ సిటిజన్స్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నాయి. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించేందుకు క్లబ్ ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ముమ్మరంగా జరగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సోమినేని సురేష్‌బాబు మాట్లాడుతూ వాలీబాల్ పోటీలకు పది టీములు హాజరయ్యాయని, శనివారం ఇదే గ్రౌండులో కబడ్డీ పోటీలు, మినీ స్టేడియంలో షటిల్ డబుల్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రిటైర్డ్ ఎస్పీ రాజశిఖామణి మాట్లాడుతూ క్రీడలపై సమాజంలో మార్పు తీసుకురావాలని, అందుకు ప్రోత్సాహం ముఖ్యమని అన్నారు. ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తూ యువతను ప్రోత్సహిస్తున్న లయన్స్ సభ్యులను అభినందించారు. లయన్స్ పాస్ట్ ప్రెసిడెంట్ వీవీ రమణ, పువ్వాడ రాజేష్, డాక్టర్ బట్టు బాలాజీ, ఆత్మకూరు బ్రహ్మయ్య, కార్పొరేటర్ శాండిల్య తదితరులు పాల్గొన్నారు.



సౌత్ జోన్ వాలీబాల్ పోటీల్లో పేస్ విద్యార్థి సత్తా



సురేష్‌ను అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ పాలిటెక్నిక్ కాలేజీలో ట్రిపుల్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.సురేష్ సౌత్‌జోన్ వాలీబాల్ పోటీల్లో రాణించి కాలేజీకి ఖ్యాతి తీసుకొచ్చారని కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో సురేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో రాణించడమే కాకుండా ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సౌత్ జోన్ పోటీల్లోనూ అద్భుత ప్రతిభ కనబరిచాడని, తద్వారా ద్వితీయస్థానంలో నిలిచాడని పేర్కొంటూ సురేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు సదావకాశం

ఒంగోలు: ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఊరట కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో 60,898 అసెస్‌మెంట్లకు గానూ రూ.55.35 కోట్ల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. ఈ నెల 17 నాటికి రూ.23.71 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా 24,392 అసెస్‌మెంట్లకు సంబంధించి రూ.31.64 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ నెల 31వ తేదీలోగా ఏకమొత్తంగా బకాయిలు చెల్లించినవారికి వడ్డీ మాఫీ జరుగుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. శనివారం, ఆదివారం సెలవు దినాలు అయినప్పటికీ.. నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్ను చెల్లించవచ్చని, అదే విధంగా నెట్‌బ్యాంకింగ్, ఆన్‌లైన్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, యూపీఐ పేమెంట్స్ ద్వారా, నగరపాలక సంస్థ పేరున చెక్కు/డీడీ ద్వారా కూడా చెల్లించవచ్చని కమిషనర్ వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కనిగిరి రూరల్: స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఘన, వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళల నుంచి ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు ఎంపికకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ డీవీఎస్ నారాయణరావు శుక్రవారం తెలిపారు. వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు ఈ అవార్డులకు అర్హులని కమిషనర్ వివరించారు. ఈనెల 23 లోగా తమ దరఖాస్తులను మున్సిపల్ ఆఫీసుకు అందించాలన్నారు. ఎంపికైన వారికి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం ఇన్‌చార్జి శానటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు (7893114370)ను సంప్రదించాలన్నారు.

అకాల వర్షంతో తీవ్ర నష్టం

పామూరు: మండలంలో రెండు రోజుల్లో కురిసిన వర్షం గోపాలపురం, మోట్రావులపాడు, ఇనిమెర్ల గ్రామాల్లో ఇటుకబట్టీ నిర్వాహకులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వర్షం అకస్మాత్తుగా గురువారం రాత్రి, శుక్రవారం సాయంత్రం కురవడంతో బట్టీల వద్ద తయారీలో ఉన్న పచ్చి ఇటుకల కిందకు నీరుచేరి పెద్ద సంఖ్యలో కరిగిపోయి బట్టీ నిర్వాహకులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వాతావరణశాఖ హెచ్చరికలతో ఇటుకలకు పైన కవర్లను కప్పినా నీరు కిందివైపున పచ్చి ఇటుకల కిందకుపోవడంతో నష్టం వాటిల్లినట్లు బట్టీల యజమానులు సత్యం రెడ్డి, బాస్కర్ పలువురు తెలిపారు.



గోపాలపురంవద్ద ఇటుకల కిందకు చేరిన నీరు

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు పాటించాలి



కారుమంచిలో శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ స్వర్ణలత

టంగుటూరు: అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏఓ స్వర్ణలత సూచించారు. మండలంలోని సూరారెడ్డిపాలెం, కారుమంచి రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితిని గమనించి రెండు లేదా మూడు రోజుల తర్వాత వరి కోత కోయాలని రైతులకు సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిస్తే పక్వానికి వచ్చిన శనగలో గింజలు రంగు మారి ముదురు కాయలు మొలక వచ్చే ప్రమాదం ఉందని, ప్రస్తుతానికైతే ఇబ్బంది లేదన్నారు. మండలంలో 28.4 మి.మీ వర్షపాతం నమోదైందని ఏఓ తెలిపారు.

శనగలను కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోండి

కొండపి: శనగలను కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని రైతులకు ఏఓ వి.రాము సూచించారు. కొండపి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శనగల కొనుగోలు కేంద్రాన్ని సభ్యులతో కలిసి ఏఓ ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటా ఎర్ర శనగలకు రూ.5,530 మద్దతు ధర ఇస్తోందని పేర్కొన్నారు. నాబార్డు డీడీఎం వెంకటరమణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను, నాబార్డు నిధులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆర్.కోటరాజు, బొక్కిసం సుబ్బారావు, పీడీసీసీ బ్యాంకు మేనేజర్ మధుసూదనరావు, సీఈఓ ఎస్.పవన్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకట నారాయణ, సొసైటీ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అంకేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదీప



కొండపిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాము

మద్దిపూడి: ఈ క్రాప్‌లో నమోదు చేయించుకున్న శనగ రైతులు ఆర్బీకేలో ధాన్యాన్ని అమ్ముకోవాలని ఎంపీడీఓ ఎస్.సుదీప సూచించారు. మండలంలోని అంకేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ.. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. రబీ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

● ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి



కరవదిలో భూమి పూజలో పాల్గొన్న అధికారులు

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలందరికీ నిర్మిస్తున్న గృహాలను వేగంగా పూర్తిచేయాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని గుండాయపాలెం గ్రామంలో జగనన్న లే అవుట్‌లో నిర్మిస్తున్న గృహాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా గృహ ప్రవేశ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈలోగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. ఆర్థిక ఇబ్బందులున్న ఎదుర్కొని గుండాయపాలెంలో లే అవుట్ ఏర్పాటు చేసి విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి సౌకర్యాలను లక్షలాది రూపాయలతో కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, హౌసింగ్ ఏఈ పృథ్వీ, కార్యదర్శి ఆశీర్వాదం, సర్పంచ్ రేవు సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకులు పేతురు, బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కరవదిలోని లే అవుట్లో భూమి పూజ అనంతరం నూతనంగా గృహాలు నిర్మించుకునేందుకు ఆధునిక టెక్నాలజీతో పిల్లర్లు వేసే గుంతలను తీసే కార్యక్రమంలో ఎంపీడీవో, హౌసింగ్ డీఈ, హౌసింగ్ ఏఈ, కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన ఎంపీపీ

ఒంగోలు రూరల్: మండలంలోని వలేటివారిపాలెం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, మండల ప్రాథమిక పాఠశాలను ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ నల్లమోతు సౌజన్య, మాజీ వైస్ ఎంపీపీ నల్లమోతు రాఘవరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చప్పిడి సోమశేఖర్, కార్యదర్శి రంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ఎంపీపీ మల్లికార్జునరెడ్డి

రామ్‌గోపాల్‌వర్మపై కేసు నమోదు చేయాలి



నిరసన తెలియజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఒంగోలు: రామ్‌గోపాల్‌వర్మ మహిళలు, విద్యార్థుల పట్ల మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందని, ఆయనపై సుమోటోగా కేసు నమోదు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వీఐపీ రోడ్డు కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగార్జున యూనివర్శిటీలో అకడమిక్ ఎగ్జిబిషన్ ప్రారంభించేందుకు హాజరైన రామ్‌గోపాల్‌వర్మ విద్యార్థులను తిని, తాగి ఎంజాయ్ చేయమని, కష్టపడి చదవకుండా తిరగాలని, మహిళలపట్ల మరింత జుగుప్సాకరంగా, అవమానకరంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దారుణంగా ప్రసంగించిన రామ్‌గోపాల్‌వర్మను కీర్తించిన వైస్ చాన్సలర్ రాజశేఖర్‌ను భర్తరఫ్ చేయాలని, లేకుంటే విద్యార్థి యువజన, మహిళ, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను ఉపయోగంలోకి తీసుకురావాలి



కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహిస్తున్న మండల ప్రత్యేక అధికారి అర్చన

గుండమాల (కొత్తపట్నం): గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ఎస్‌డబ్ల్యూపీసీలు ఉపయోగంలోకి తీసుకురావాలని మండల ప్రత్యేక అధికారి అర్చన అన్నారు. శుక్రవారం కె.పల్లెపాలెం పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీని తనిఖీ చేశారు. ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలతో అర్చన మాట్లాడుతూ ప్రతి ఇంటికి రెండు డస్ట్‌బిన్లు ఇవ్వడం జరిగిందని, అందులో తడి, పొడి చెత్త వేయడం జరుగుతుందని, వాటిని క్లాప్ మిత్రలు ఇంటి నుంచే తడి, పొడి చెత్తలను వేరువేరుగా కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వాటితో వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలని వివరించారు. ఎస్‌డబ్ల్యూపీసీలో ఉన్న మిషనరీ తుప్పుపట్టకుండా ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుజాత, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

దంతాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వ దంత వైద్యురాలు రమ్య

చీమకుర్తి: చీమకుర్తి ప్రభుత్వాస్పత్రికి చెందిన దంత వైద్యురాలు జీ రమ్య ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తి పట్టణంలోని రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు దంతాలను శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ నెల 20వ తేదీ ప్రపంచ నోటి ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటిని శుభ్రంగా ఉంచుకోవడం, బ్రష్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. చాక్‌లెట్లు, కూల్ డ్రింక్స్ వంటి పదార్థాలు తీసుకోవడం తగ్గించాలన్నారు. దంతక్షయాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చీమకుర్తి ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని, ఈ అవకాశాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిరులు కురిపిస్తోన్న రాగి



విరగ పండిన రాగి పంట

హనుమంతునిపాడు: రాగి పంట సిరులు కురిపిస్తోంది. మండలంలోని బోరు బావుల కింద వరిపంట సాగు చేసిన మాగాణి భూముల్లో ప్రస్తుతం రాగి పంట సాగు చేశారు. రాగులకు మంచి గిరాకీ ఉంది. గతంలో బావుల కింద ప్రతి గ్రామంలో రాగి, సజ్జ, కొర్రలను పండించేవారు. వర్షాధారంగా ఆరికలు, సామలు, వరిగలు సాగు చేసేవారు. అనంతరం చెరువులు, వ్యవసాయ బావుల్లో నీరు తగ్గడంతో ఈ పంట క్రమేణా తగ్గుతూ వచ్చింది. గతంలో గ్రామాల్లో ప్రతి ఒక్కరూ రాగి సంగటి, ఆరిక, కొర్ర, వరిగ, సజ్జ, జొన్న అన్నం ఎక్కువగా తినేవారు. అనంతరం వాటిని తినటం తగ్గుతూ వచ్చింది. వరి పంటను సాగు చేయటం మొదలు పెట్టిన తరువాత చిరు ధాన్య పంటలు సాగు తగ్గింది. ప్రస్తుతం మళ్లీ చిరుధాన్యాలకు మంచి రోజులు వచ్చాయి. గ్రామాల్లో మధ్యాహ్నం పూట రాగి సంగటి వాడుతున్నారు. షుగర్ వ్యాధి గ్రస్తులు ఇష్టంగా తింటున్నారు. పట్టణాలల్లో కూడా సంగటి హోటళ్లు వెలశాయి. దీంతో రాగి ధాన్యానికి మంచి గిరాకీ వచ్చింది. గ్రామాల్లో చెరువుల, కింద, బోరు బావులు కింద వరి మాగాణి భూములో వరి కోత కోసిన తరువాత రాగి పంటను సాగు చేసి పండిస్తున్నారు. రైతు వద్దనే కిలో రాగులు రూ. 40 పెట్టి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రాగి పంట సాగుతో మంచి లాభాలు రాబట్టుతున్నారు. హాజీపురం, దొడ్డిచింతల, కొత్త సీతారాంపురం గ్రామాల్లో చెవరు కింద, బోరు బావుల కింద సాగు చేసిన రాగి పంట సిరులు కురిపిస్తోంది. రాగి గడ్డి పశువులకు బలమైన మేత కావడంతో దానికి కూడా గిరాకీ పెరిగింది.

ఏపీఎం తీరుపై వీఓఏల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

మద్దిపూడి: స్థానిక ఏపీఎం బాబురావు వ్యవహరిస్తున్న తీరుపై వైఎస్సార్ కేపీ కార్యాలయం వద్ద మండలంలోని వీఓఏలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. సమీక్ష సమయంలో మహిళలు అని కూడా చూడకుండా ఏపీఎం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి గౌరవ వేతనం తీసుకోకుండా బ్యాంక్ పనులు సైతం చేస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ పరంగా సభ్యులకు ఏ పని జరగాలన్నా సీసీ నగదు డిమాండ్ చేస్తున్నారన్నారని ఆరోపించారు. ఏపీఎం తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.సుదీపకు వినతి పత్రం అందజేశారు.

నేడు శ్రీయోగానంద స్వామి ఆలయ మెట్ల నిర్మాణానికి శంకుస్థాపన

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఉపాలయానికి తూర్పు వైపున మెట్ల నిర్మాణానికి శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు నిర్వహించనున్నట్లు ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న తహసీల్దార్

చీమకుర్తి: శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలో దాదాపు 200 మంది యాచకులకు అన్నదానం చేశారు. తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆర్థిక సహకారంతో శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రోడ్ల మీద అన్నం లేక ఇబ్బంది పడుతున్న యాచకులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ కుటుంబ సభ్యులతో పాటు శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై తెగిపడిన తీగ



రోడ్డుపై తెగి పడిన 11 కేవీ విద్యుత్ తీగ

వేటపాలెం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో జెడ్పీ బాలికోన్నత పాఠశాల ముందు అకస్మాత్తుగా 11 కేవీ విద్యుత్ తీగ శుక్రవారం తెగి రోడ్డుపై పడింది. హైస్కూల్ ప్రధాన గేటు ముందు రోడ్డుపైనే వైరు తెగి పడింది. అప్పటివరకు అక్కడే ఉన్న విద్యార్థులు తీగ కిందపడిన సమయంలో వస్తున్న మంటలతో అప్రమత్తమై ప్రమాదాన్ని గ్రహించి పక్కకు పరుగులు తీశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు సమాచారం అందించడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

• తెలంగాణ

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ రద్దు!

- దీంతోపాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలు కూడా..
- ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) రద్దు చేసింది. దీనితోపాటు గత రెండు నెలల్లో నిర్వహించిన 'అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ (ఏఈఈ), డివిజనల్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ (డీఏఓ)' పరీక్షలనూ రద్దు చేస్తున్నట్టు కమిషన్‌ శుక్రవారం ప్రకటించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్‌) ప్రాథమిక నివేదికపై శుక్రవారం కమిషన్‌ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. చైర్మన్‌, సభ్యులు, కార్యదర్శి పాల్గొన్న ఈ భేటీలో గ్రూప్‌–1 పరీక్షతో పాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలపై చర్చించి.. వాటిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే మార్చి ఐదున నిర్వహించిన అసిస్టెంట్‌ ఇంజనీర్‌ (ఏఈ) పరీక్షను రద్దు చేయడం తెలిసిందే. కాగా, గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షను జూన్‌ 11వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. మిగతా పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడిస్తామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

చంద్రయాన్‌–3
'సామర్థ్య' పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రుడిపై పరిశోధనల కోసం ఈ ఏడాది జూన్‌ నెలాఖరులోపు చంద్రయాన్‌–3 ప్రయోగం నిర్వహించడానికి పకడ్బందీగా సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా బెంగళూరులోని యూఆర్‌ శాటిలైట్‌ సెంటర్‌లో మూడు మాడ్యూల్స్‌తో కూడిన చంద్రయాన్‌–3 ఉపగ్రహాన్ని తయారుచేసి అక్కడే దాని శక్తి సామర్థ్యాలను ఇటీవల పరీక్షించామని ఇస్రో గురువారం రాత్రి తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆర్బిటర్‌ మాడ్యూల్‌, ల్యాండర్‌ మాడ్యూల్‌, రోవర్‌ మాడ్యూల్‌ మూడు విభాగాలుగా చంద్రయాన్‌–3 ఉపగ్రహాన్ని రూపొందించారు. చంద్రుడిపై ఉన్న వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆ ఉపగ్రహాన్ని పరీక్షించారు. ప్రయోగ సమయంలో ఎదురయ్యే కఠినమైన కంపనం, ధ్వని వాతావరణాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని ధ్రువీకరించుకునేందుకు అవసరమైన పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని ఇస్రో వెల్లడించింది.



బెంగళూరులోని యూఆర్‌ రావు శాటిలైట్‌ సెంటర్‌లో చంద్రయాన్‌-3 ఉపగ్రహాన్ని పరీక్షిస్తున్న దృశ్యం

భారత్‌-ఫ్రాన్స్‌ అంతరిక్ష సంబంధాలు బలోపేతం

భారత్‌–ఫ్రాన్స్‌ దేశాల అంతరిక్ష సంబంధాలు మరింత బలోపేతం చేసేందుకు ఫ్రెంచి ప్రభుత్వం నిరంతరం పనిచేయడానికి అంగీకారం తెలిపిందని ఇస్రో తన వెబ్‌సైట్‌లో శుక్రవారం పేర్కొంది. ఫ్రాన్స్‌ విదేశాంగ మంత్రిత్వశాఖ సమన్వయంతో ఆ దేశ నేషనల్‌ అసెంబ్లీ విదేశీ వ్యవహారాల పార్లమెంట్‌ స్టాండింగ్‌ కమిటీ అధ్యక్షుడు జీన్‌–లూయిస్‌ బౌర్లాంగెస్‌ నేతృత్వంలో ఫ్రెంచి ప్రతినిధి బృందం గురువారం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఇస్రోలోని హ్యూమన్‌ స్పేస్‌ ఫ్లైట్‌ సెంటర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఆర్‌.ఉమా మహేశ్వరన్‌ ఆధ్వర్యంలో ఇస్రో, డాస్‌ ప్రతినిధి బృందం ఫ్రెంచి ప్రతినిధుల బృందానికి భారత అంతరిక్ష కార్యక్రమాల గురించి వివరించింది.

ఏపీ ఇన్‌ పార్లమెంట్‌

ఏపీలో తగిన యూరియా నిల్వలున్నాయి

లోక్‌సభలో కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో 2022–23 రబీ సీజన్‌కు తగిన యూరియా నిల్వలు ఉన్నాయని కేంద్ర ఎరువులు రసాయనాలు శాఖ సహాయ మంత్రి భగవంత్‌ ఖుబా తెలిపారు. 2022–23 రబీ సీజన్‌కు గానూ 12–3–23 నాటికి 7.82 లక్షల మెట్రిక్‌ టన్నులు అవసరం ఉండగా 11.69 లక్షల మెట్రిక్‌ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2022–23కు గానూ 12–3–23 నాటి లెక్కల ప్రకారం 15.82 లక్షల మెట్రిక్‌ టన్నులు అవసరం కాగా.. 17.76 లక్షల మెట్రిక్‌ టన్నులు అందుబాటులో ఉన్నట్లు కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు.

మంగళగిరి ఎయిమ్స్‌లో 960 పడకలు

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన పథకంలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్‌ సహా 22 ఎయిమ్స్‌ల్లో 18,250 పడకలు మంజూరు చేశామని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌ తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్‌కు 960 బెడ్‌లు మంజూరు చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైఎస్‌ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో మానవ అక్రమ రవాణా కేసుల తగ్గుదల

ఆంధ్రప్రదేశ్‌లో మానవ అక్రమ రవాణా కేసులు తగ్గుముఖం పడుతున్నాయని కేంద్ర మహిళ శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2019లో 245 కేసులు నమోదు కాగా 2020లో 171, 2021లో 168 కేసులు నమోదైనట్లు వైఎస్సార్‌సీపీ సభ్యురాలు చింతా అనూరాధ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌ఆర్‌బీ మెరుగుదల

ఆంధ్రప్రదేశ్‌లో సెక్స్‌ రేషియో ఎట్‌ బర్త్‌ (ఎస్‌ఆర్‌బీ) మెరుగుదలలో ఉందని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014–15లో ఎస్‌ఆర్‌బీ 921 ఉండగా 2021–22 నాటికి 950కి చేరుకుందని వైఎస్సార్‌సీపీ సభ్యులు మార్గాని భరత్‌రామ్‌, సంజీవ్‌కుమార్‌ల ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

సీఆర్‌ఐవైఎన్‌ ఏర్పాటు ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సెంట్రల్‌ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ యోగా, న్యాచురోపతి (సీఆర్‌ఐవైఎన్‌) ఏర్పాటు ప్రతిపాదన ఏదీలేదని కేంద్ర ఆయుష్‌ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో 12 సఖి నివాస్‌లు

ఆంధ్రప్రదేశ్‌లో వర్కింగ్‌ ఉమెన్‌ నిమిత్తం 12 సఖి నివాస్‌లు పనిచేస్తున్నాయని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2019–20లో 1.46 కోట్లు విడుదల చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎన్‌. రెడ్డెప్ప ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

డీఎంఎఫ్‌ ఏర్పాటు ప్రతిపాదన ఉంది

రక్షణ బలగాల ఆధునికీకరణ నిమిత్తం డిఫెన్స్‌ మోడరనైజేషన్‌ ఫండ్‌ (డీఎంఎఫ్‌) ఏర్పాటు ప్రతిపాదన ఉందని రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌ భట్‌ తెలిపారు. ఆర్థిక మంత్రిత్వశాఖతో సంప్రదింపులు చేసి ఫండ్‌ అమలుచేయడానికి తగిన యంత్రాంగం రూపొందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

రైల్వే అండర్‌బ్రిడ్జిలు నిర్మించండి
కేంద్రమంత్రి వైష్ణవ్‌కు ఎంపీ సత్యవతి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ : అనకాపల్లి నియోజకవర్గంలోని మూలపేట నుంచి సత్యనారాయణపురం, లంకెలపాలెం సమీప రైల్వే లెవెల్‌ క్రాసింగ్‌ల వద్ద రైల్వే అండర్‌ బ్రిడ్జిలు నిర్మించాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో శుక్రవారం భేటీ అయిన ఎంపీ సత్యవతి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయా అండర్‌ బ్రిడ్జిల నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటోందని ప్రజల ఇబ్బందులు గమనించి త్వరగా పూర్తిచేయాలని కోరారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ పనులు వేగవంతం చేయాలని కూడా కేంద్రమంత్రికి ఎంపీ సత్యవతి విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్‌ స్మృతివనం పనుల వేగం పెంచండి



అంబేడ్కర్‌ స్మృతివనం నిర్మాణ పనులను సమీక్షిస్తున్న మంత్రులు ఆదిమూలపు, బొత్స, మేరుగు, కొట్టు

సాక్షి, అమరావతి: సమన్వయంతో పని చేసి అంబేడ్కర్‌ స్మృతివనం పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రుల కమిటీ ఆదేశించింది. శుక్రవారం సచివాలయంలో అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్‌, మంత్రి మేరుగు నాగార్జున, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్‌ సమీక్ష నిర్వహించారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయలక్ష్మి స్మృతివనం పనుల పురోగతిని మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. పనుల్లో ఎక్కడా లోపాలు జరగకుండా.. సీఎం జగన్‌ సూచనల ప్రకారం స్మృతివనాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు. 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఢిల్లీలో ఇప్పటికే సిద్ధమైన విగ్రహం విడి భాగాలను రాష్ట్రానికి త్వరగా తెప్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్మృతివనంలో అంబేడ్కర్‌ జీవిత విశేషాలను తెలియజేసే శిల్పాలు, గ్రంథాలయంతో పాటు సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను వేగంగా ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజికల్‌ వాటర్‌ ఫౌంటెన్లు ఏర్పాటు చేయాలని, చుట్టూ ఉండే ఫుట్‌పాత్‌ను కూడా సీఎం సూచించిన విధంగా అందంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు కె.హర్షవర్ధన్‌, అదితి సింగ్‌, నరసింహారావు, కేపీసీ ప్రాజెక్ట్స్‌ డైరెక్టర్‌ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బహుజనుల
సంక్షేమానికి పెద్దపీట

901వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: బడ్జెట్‌లో బహుజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డికి తాము ఎప్పటికీ రుణపడి ఉంటామని, కులవాదంతో అధికారం కోసం వెంపర్లాడుతున్న బాబు అండ్‌ కో ఆటలు సాగవని గుర్తుంచుకుని మసలుకోవాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 901వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. బహుజనులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేస్తున్న ప్రభుత్వ చర్యలను చూసి కులవాదులకు అక్కసు పెరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పేదలకు 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గూడు కల్పించిన జగనన్న చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. అమరావతి పేరుతో 29 గ్రామాల్లో కులవాదులు చేస్తున్న పెట్టుబడి ఉద్యమం పూర్తిగా ముగిసిందని తెలిపారు. యువగళం పేరుతో అజ్ఞాని లోకేశ్‌ను చంద్రబాబు ప్రజల్లోకి పంపాడన్నారు. బాబు ఇకనైనా తప్పుడు యత్నాలు మానుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి శ్రీకాంత్‌ రాజీనామా

- వైఎస్సార్‌సీపీలో చేరిక
- బడ్జెట్‌లో కాపు సంక్షేమానికి రూ.4,887 కోట్ల కేటాయింపు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సాక్షి, అమరావతి : కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి పెన్నేరు శ్రీకాంత్‌ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్యకు పంపినట్టు శ్రీకాంత్‌ ప్రకటించారు. ఏపీ కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ(కార్పొరేషన్‌) చైర్మన్‌ అడపా శేషగిరి సమక్షంలో వంద మంది అనుచరులతో శ్రీకాంత్‌ వైఎస్సార్‌సీపీలో చేరారు. కాపుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్న ఉద్దేశంతో తాను వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు చెప్పారు. కాపు సంక్షేమానికి 2023–24 బడ్జెట్‌లో రూ.4,887 కోట్లు కేటాయించి కాపుల మేలుకు చర్యలు చేపడుతున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెబుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏపీ కాపు కార్పొరేషన్‌ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అడపా శేషగిరి మాట్లాడారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాపు కార్పొరేషన్‌ చైర్మన్‌ అడపా శేషు

స్థానిక వార్తలు

చూర, ముక్క కొనుగోలుకు ఓకే..



టంగుటూరులో వేలాన్ని పర్యవేక్షిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు



కనిగిరి వేలం కేంద్రంలో బేళ్లు కొనుగోలు చేస్తున్న కంపెనీల ప్రతినిధులు

- దళారులకు విక్రయించవద్దని టుబాకో బోర్డు సూచన
- త్వరలోనే కొనుగోలు తేదీలు ప్రకటిస్తామని స్పష్టీకరణ
- అకాల వర్షాలకు బేళ్లు తడవకుండా జాగ్రత్తలు పాటించాలన్న అధికారులు

కొండపి/టంగుటూరు/ఒంగోలు రూరల్‌/కనిగిరి రూరల్‌: రైతుల వద్ద ఉన్న పొగాకు చూర, ముక్క కొనుగోలుకు పొగాకు బోర్డు అనుమతి ఇచ్చినట్లు కొండపి, టంగుటూరు వేలం కేంద్రాల నిర్వహణాధికారులు ఎస్‌.రామారావు, శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వేలం కేంద్రాల్లో అమ్ముకోవటానికి చూర, ముక్కలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వేలం కేంద్రంలో కాకుండా బయట విక్రయించవద్దని రైతులకు స్పష్టం చేశారు. పొగాకు చూర కొనుగోలుకు సంబంధించి తేదీలను త్వరలోనే బోర్డు వెల్లడిస్తుందని తెలిపారు. అదే విధంగా పొగాకు బేళ్లు సఫ్ట్‌, వేడి లేకుండా క్వాలిటీ, గ్రేడింగ్‌ మంచిగా చూసుకుని వేలానికి తెచ్చుకోవాలని చెప్పారు. వర్షం పడే సూచనలు ఉన్నందున ముందు జాగ్రత్తగా చెక్కుల మీద టార్పాలిన్‌ పట్టలు కప్పి తెచ్చుకోవాలన్నారు.

ఒంగోలు–2లో అత్యధిక ధర కేజీ రూ.201

ఒంగోలు రూరల్‌లోని వేలం కేంద్రం–2లో శుక్రవారం పొగాకు అమ్మకాలు 562 బేళ్ళు జరిగాయి. కేంద్రానికి 673 బేళ్ళు రాగా వ్యాపారులు 562 బేళ్లు కొనుగోలు చేయగా 46 నోబిడ్‌ బేళ్లు అయ్యాయి. అత్యధిక ధర రూ.201 పలుకగా అత్యల్ప ధర రూ.190 సరాసరి ధర రూ.198.38 గా నమోదయినట్లు వేలం నిర్వహణాధికారి రామకృష్ణ తెలిపారు.

కొండపిలో అత్యల్ప ధర రూ.189

కొండపి పొగాకు వేలంకే ంద్రంలో వేలం కేంద్రం అధికారి ఎస్‌. రామారావు శుక్రవారం నిర్వహించిన పొగాకు వేలంలో వ్యాపారులు 815 పొగాకు బేళ్ళు కొనుగోలు చేశారు. వేలం కేంద్రం పరిధిలోని ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాల నుంచి రైతులు 927 పొగాకు బేళ్ళు వేలానికి పెట్టారు. వ్యాపారులు 815 పొగాకు బేళ్ళు కొనుగోలు చేసి 90 బేళ్ళు వివిధ కారణాలతో తిరస్కరించారు. అత్యధిక ధర కేజీ పొగాకు 200 రూపాయలకు కొనుగోలు చేయగా అత్యల్ప ధర కేజీ 189 రూపాయలకు కొనుగోలు చేశారు. సరాసరి ధర కేజీ పొగాకు 197.94 రైతుకి దక్కింది.

టంగుటూరులో సరాసరి ధర రూ.197.02

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం జరిగిన వేలంలో కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకి చెందిన రైతులు 822 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 787 కొనుగోలు జరిగాయి. 25 బేళ్లు తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 200 కాగా, కనిష్ట ధర రూ. 170 పలకగా, సరాసరి రూ. 197. 02 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 11 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఐటీసీ కంపెనీ వైస్‌ ప్రెసిడెంట్‌ క్రిష్ణ కుమార్‌, లీఫ్‌ మేనేజర్‌ శివకుమార్‌ పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి పొగాకు మార్కెట్టును, కంపెనీ కొనుగోలును పరిశీలించి, కంపెనీ బయర్లకు సూచనలు చేసి వేలం తీరును పరిశీలించారు.

కనిగిరిలో..

కనిగిరి రూరల్‌: కనిగిరి టుబాకో కేంద్రంలో శుక్రవారం 256 పొగాకు బేళ్లు కొనుగోలు జరిగినట్లు వేలం కేంద్రం ఇన్‌చార్జి బి. కోటేశ్వరరావు తెలిపారు. కేపీ అగ్రహారం క్లస్టర్‌ పరిధిలోని గ్రామాల నుంచి 284 పొగాకు బేళ్లు రాగా అందులో 256 బేళ్లు ఆక్షన్‌ పాడుకోగా, 28 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 9 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొనగా, పొగాకు కేజీ ధర గరిష్టం రూ. 200 పలుకగా, కనిష్టం రూ 180 పలికినట్లు అధికారులు వెల్లడించారు.

రిటైర్డ్‌ పోలీస్‌ ఆఫీసర్స్‌ భవనం ప్రారంభం

- విశ్రాంత జీవితాన్ని సంతోషంగా గడపాలి
- ఎస్పీ మలికా గర్గ్‌ ఆకాంక్ష

ఒంగోలు: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన రిటైర్డ్‌ పోలీసు ఆఫీసర్స్‌ భవనాన్ని ఎస్పీ మలికా గర్గ్‌ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విశ్రాంత సిబ్బందికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. భవనం అందుబాటులో ఉండటం వల్ల రిటైర్‌ అయిన పోలీసు సిబ్బంది అందరు ఒకచోటకు చేరడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. అనుభవాలు, ఆలోచనలు పంచుకునేందుకు, మానసిక ఒత్తిడిని జయించేందుకు భవనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కాలక్షేపం కోసం గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. రిటైర్‌ అయిన సిబ్బంది అంతా ఒక కుటుంబంలా కలిసిమెలిసి జీవించాలని కోరుకుంటున్నానన్నారు. వయోభారం దృష్ట్యా మంచి ఆహార నియమాలు పాటిస్తూ, ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రిటైర్డ్‌ ఉద్యోగులు పలువురు ఎస్పీ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ మరియదాసు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, ట్రాఫిక్‌ డీఎస్పీ విక్రమ్‌ శ్రీనివాసరావు, ఏఆర్‌ డీఎస్పీ వెంకటేశ్వరరావు, రిటైర్డ్‌ పోలీసు అధికారుల సంఘం నాయకుడు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



భవనం ప్రారంభోత్సవం సందర్భంగా రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎస్పీ మలికాగర్గ్‌

వ్యాయామంతో జీవితకాలాన్ని పెంచుకోవచ్చు

– ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: వ్యాయామాన్ని క్రమం తప్పకుండా చేయడం ద్వారా జీవితకాలాన్ని పెంచుకోవడం సాధ్యపడుతుందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్‌ చాన్స్‌లర్‌ మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సెమినార్‌ హాల్లో లైఫ్‌ స్పాన్‌–మోటార్‌ డెవలప్‌మెంట్‌ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు వ్యాయామం ఎలా తోడ్పడుతుందో వివరించారు. సదస్సు అధ్యక్షులు, విశ్వవిద్యాలయం స్పెషల్‌ ఆఫీసర్‌ బాణాన కృష్ణ, అన్నామలై యూనివర్శిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ కేపీ బాల మురుగన్‌, ప్రొఫెసర్‌ ఎస్‌.శ్రీధర్‌, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డైరెక్టర్‌ డాక్టర్‌ ఐ.దేవి వరప్రసాద్‌ తదితరులు వ్యాయామ విద్య– జీవితకాలం పెంపు అనే అంశంపై ప్రసంగించారు.



వీసీ మారెడ్డి అంజిరెడ్డికి మెమొంటో అందిస్తున్న ఫిజికల్‌ డిపార్టుమెంట్‌ డైరెక్టర్‌ ఐ.దేవీవరప్రసాద్‌

పోగొట్టుకున్న బ్యాగ్‌ అప్పగింత

కంభం: రైలులో ప్రయాణిస్తూ పోగొట్టుకున్న తన బ్యాగ్‌ను రైల్వే పోలీసులు బాధితుడికి శుక్రవారం అప్పగించారు. కొనకలమిట్లకు చెందిన తిరుపతయ్య గురువారం రాత్రి విజయవాడ నుంచి హుబ్లీ రైలులో ప్రయాణిస్తు మార్కాపురంలో దిగాడు. ఆ సమయంలో తన బ్యాగ్‌ను రైలులోనే మరిచిపోయాడు. దీంతో బాధితుడు తిరుమలయ్య మార్కాపురం రైల్వే సిబ్బందికి సమాచారం అందించడంతో గిద్దలూరు ఆర్పీఎఫ్‌ కానిస్టేబుల్‌ కంభం రైల్వేస్టేషన్‌లో తన బ్యాగ్‌ను కంబం రైల్వే స్టేషన్‌లో దించి బాధితుడికి సమాచారం అందించారు. బ్యాగ్‌లో రూ.5 వేలు నగదు, రూ.1.50 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు ఉన్నాయని వాటిని క్షేమంగా తిరుమలయ్యకు స్టేషన్‌మాస్టర్‌ సమక్షంలో అప్పగించారు.



బాధితుడికి అప్పగిస్తున్న రైల్వే సిబ్బంది

నేటి నుంచి శ్రీగిరిలో టీటీడీ పంచాంగాలు

ఒంగోలు: శ్రీగిరిలో భక్తులకు శనివారం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం పంచాంగాలు అందుబాటులో ఉంటాయని శ్రీగిరి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు కుర్తాళం శ్రీసిద్దేశ్వరి పీఠపాలిత శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని టీటీడీ సేల్స్‌ కౌంటర్‌లో విక్రయానికి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్‌ ఆంగ్ల పరీక్షకు 2,124 మంది గైర్హాజరు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో శుక్రవారం ఇంటర్‌ ప్రథమ సంవత్సరం ఆంగ్ల పరీక్షకు 2124 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును కలెక్టర్‌, ఎస్పీలతోపాటు ఇంటర్మీడియెట్‌ బోర్డు అధికారులు, స్క్వాడ్‌ బృందాల సభ్యులు తనిఖీ చేశారు. జనరల్‌ విభాగంలో 26,502 మందికి 25,073 మంది, ఒకేషనల్‌ విభాగంలో 3,669 మందికి 2,974 మంది హాజరయ్యారని, మొత్తం మీద 2,124 మంది గైర్హాజరైనట్లు ఆర్‌ఐఓ ఎ.సైమన్‌ విక్టర్‌ వివరించారు. పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు.

వాహనం ఢీ.. యువకుని దుర్మరణం

మద్దిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒకటిన్నర గంటల సమయంలో గుండ్లాపల్లి ఫ్లెఓవర్‌పై చోటు చేసుకుంది. గార్లపాడు పునరావాస కాలనీకి చెందిన నందవరపు గంగయ్య (25) టైల్స్‌ పరిచే పనులు చేస్తుంటాడు. గత రెండు రోజులుగా పనులు లేకపోవడంతో ఇంటి పట్టున ఉంటూ గురువారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానంటూ వెళ్లాడని అతని భార్య తెలిపింది. గుండ్లాపల్లి ఫ్లెఓవర్‌పై గుంటూరు వైపు వెళ్లే రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని గంగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా తన భర్త కింద పడిపోయి ఉన్నాడని వెంటనే అంబులెన్స్‌ ద్వారా ఒంగోలు తీసుకు వెళుతుండగా మధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మద్దిపాడు ఏఎస్‌ఐ రమేష్‌ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించిన గంగయ్య

సాక్షి ఫ్యామిలీ
ఒంగోలు
శనివారం ॥ 18-3-2023

కుర్రాళ్లు వినరు.
బైక్ ఎక్కి తుర్రుమంటారు.
భర్తలకు నిర్లక్ష్యం.
హెల్మెట్ లేకుండానే బయలుదేరుతారు.
ఇంటి మగవారి అసురక్షిత ప్రయాణం
స్త్రీలకు ఎప్పుడూ ఆందోళనకరమే.
ప్రతి ఇంట్లోని స్త్రీలు
ఆ ఇంటి మగవారికి రాఘవేంద్ర కుమార్‌ను చూపాలి.
స్నేహితుణ్ణి ప్రమాదంలో కోల్పోయిన అతను
సొంత డబ్బుతో ఇప్పటికి 56,000 హెల్మెట్లు పంచాడు.
పురుషులైనా స్త్రీలైనా హెల్మెట్ లేకుండా బండెక్కారంటే
ఇంటి మీదకు ముప్పు తెచ్చినట్టే అంటాడు రాఘవేంద్ర.
అతను చెప్పేది వినండి.


రాఘవేంద్ర

● హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా

మీ పిల్లలకు ఇతన్ని చూపండి

‘ఒంటి మీద ఎక్కడా దెబ్బ లేదు. తల ఒక్క దానికే తగిలింది’ అని అయినవారిని కోల్పోయి ఏడ్చేవారు ఎందరో ఉన్నారు. ఆ తలకు దెబ్బ తగలని రీతిలో జాగ్రత్త తీసుకుని ఉంటే వారంతా బతికేవారు. హెల్మెట్ వాడితే బతికేవారు.

చట్టాలు ఎన్ని చెప్పినా, నిబంధనలు విధించినా జీవితాన్ని సీరియస్‌గా తీసుకోని వారు ఎప్పుడూ ఉంటారు. వారు ఎక్కడో వేరే కుటుంబాలలో ఉంటారనుకోవద్దు. మన కుటుంబాల్లో కూడా ఉంటారు. కాలేజీకి వచ్చిన కొడుకు, ఉద్యోగానికి వెళ్లే భర్త, ట్రయినింగ్‌లో ఉన్న కూతురు.. వీరు కూడా ‘ఆ.. ఏముందిలే’ అనుకుని హెల్మెట్ వాడకుండా ఉండొచ్చు.

అలాంటి వారు తన కంట పడితే ఊరుకోడు రాఘవేంద్ర కుమార్ (36). ఇతణ్ణి అందరూ ఇప్పుడు ‘హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా’ అంటారు. నోయిడాలో నివాసం ఉండే ఇతను ఉద్యోగం వదిలేశాడు. ఇతర పనులు మానేశాడు. కేవలం హెల్మెట్‌కు సంబంధించిన చైతన్యం కోసం పని చేస్తున్నాడు. అతడు రోజూ చేసే పని కారు వేసుకుని, అందులో కొన్ని హెల్మెట్లు పడేసుకుని నోయిడా ఆగ్రాల మధ్య ఉండే ఆరు లేన్ల యమునా ఎక్స్‌ప్రెస్‌కు చేరుకుంటాడు. ఆ దారి మీద బైక్ వేసుకుని హెల్మెట్ లేకుండా ఎవరైనా వెళుతుంటే వారిని వెంబడించి ఆపుతాడు. హెల్మెట్ వాడకపోతే ఉండే ప్రమాదం గురించి చెప్పి ఉచితంగా హెల్మెట్ ఇచ్చి పంపుతాడు.

‘2014 నుంచి నుంచి నేను హెల్మెట్‌లు పంచుతున్నాను. ఇప్పటికి 56 వేల హెల్మెట్లు పంచాను. నేను పంచిన రోజునో ఆ తర్వాత ఐదారు రోజుల్లోనో ప్రమాదానికి గురై నేనిచ్చిన హెల్మెట్ వల్ల ప్రాణాలు కాపాడుకున్న వారు 30 మంది ఉన్నారు. వారంతా ఎంతో సంతోషంతో కృతజ్ఞతతో నాకు ఫోన్ చేసి తాము ప్రాణాలతో ఉండటానికి కారణం నేనేనని చెబుతారు. చాలా మందికి భారీ యాక్సిడెంట్లు అయ్యి కాళ్ల చేతులు విరిగినా తల మాత్రం ఏమీ కాకపోవడంతో బతికిపోయారు’ అంటాడు రాఘవేంద్ర కుమార్.

అయితే అతనికి కూడా హెల్మెట్ విలువ ప్రాణస్నేహితుడు మరణించాకే తెలిసింది. బిహార్‌కు చెందిన రాఘవేంద్ర కుమార్ 2009లో నోయిడా వచ్చి లా కోర్సులో



చేరాడు. అదే బిహార్ నుంచి ఇంజినీరింగ్ చేయడానికి వచ్చి కృష్ణకుమార్ అతని రూమ్మేట్ అయ్యారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు అయ్యారు. కాని 2014లో కొత్తగా వేసిన యమున ఎక్స్‌ప్రెస్ వే మీద హెల్మెట్ లేకుండా వెళుతూ కృష్ణకుమార్ యాక్సిడెంట్‌కు లోనయ్యాడు. ఒంటి మీద ఒక్క దెబ్బ లేదు. తలకే తగిలింది. మరణించాడు. ‘ వాళ్లింట్లో వాళ్లకి నా స్నేహితుడు ఒక్కగానొక్క కొడుకు కావడంతో వాడి అమ్మా నాన్నల గుండెలు పగిలి పోయాయి. హెల్మెట్ ఉంటే బతికేవాడు కదా అన్న బాధ ఇప్పటికీ వదల్లేదు నన్ను’ అంటాడు రాఘవేంద్ర.

అప్పటి నుంచి అతడు ఒక ఉద్యమంగా హెల్మెట్లు పంచుతున్నాడు. భార్య కొత్తల్లో సహకరించింది. కాని రాఘవేంద్ర కుమార్ దాదాపు తన ఆస్తులన్నీ అమ్మి ఇప్పటికి రెండు కోట్ల వరకు ఖర్చు చేసి హెల్మెట్లు పంచాడు. ‘ఉన్నదంతా ఊడ్చేశాను. పర్వాలేదు. బిహార్‌లోని నా సొంత పల్లెకు వెళ్లిపోతాను’ అని ఇటీవల అతను ప్రకటించాడు.

కాని అది పైమాటే. తనకు సరైన ప్రోత్సాహం లభిస్తే దేశంలో హెల్మెట్ల బ్యాంకులు తెరవాలని ఎవరైనా సరే అరువు తీసుకుని వెళ్లి వాడుకునేలా హెల్మెట్లు అందుబాటులో ఉంచాలని అతని కోరిక. ‘4 ఏళ్ల పైబడిన పిల్లలకు హెల్మెట్లు తప్పనిసరి చేయాలని నేను సుప్రీం కోర్టులో పిల్ వేశాను. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిశాను’ అంటాడు రాఘవేంద్ర. ‘ప్రాణం పోతే ఏం చేసినా తిరిగి రాదు’ అంటాడు.

హెల్మెట్‌ను వాడటానికి ఇష్టపడని ప్రతి ఒక్కరికి రాఘవేంద్ర చెబుతున్న విషయం అర్థం కావాలి. ప్రాణం ఉంటే లోకం ఉంటుంది.

హ్యాపీ పేరెంటింగ్

వసపిట్ట పాఠాలు


కృష్ణమాధురి

తల్లిదండ్రులుగా పిల్లలను చూసుకోవాల్సిన విధానాన్ని, తల్లిగా తన అనుభవాన్ని కళ్లకు కడుతూ యూ ట్యూబర్‌గా రాణిస్తోంది హైదరాబాద్ కొండాపూర్‌లో ఉంటున్న చిలుకూరి కృష్ణ మాధురి, నాలుగు, ఏడాదిన్నర వయసున్న పిల్లలతో కలిసి, తన స్వీయ అనుభవాలను షేర్ చేస్తుంటుంది. మాధురి మూడేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నాలు... పిల్లల పెంపకంలో తను తీసుకునే జాగ్రత్తలు ఎంతోమంది తల్లులకు పాఠాలు అవుతున్నాయి. ఈ విషయాల గురించి మాధురి మాట్లాడుతూ ...

‘‘నేను పుట్టి పెరిగింది రాజమండ్రిలో. మావారిది గుంటూరు. మా వారి ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉండేవాళ్లం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న నేను పిల్లల పుట్టడంతో ఇంటి దగ్గరే ఉండిపోయాను. పిల్లలపై తపన, వారి ఆరోగ్య జాగ్రత్తలు, పెంపకం విషయాలన్నీ తల్లిగా నాకు ప్రతిరోజూ ఓ పాఠమే. వీటిని నలుగురితో పంచుకుంటే కొంత మంది తల్లులకైనా ఉపయోగపడుతుంది కదా అని సరదాగా వీడియోలు తీసి, యూ ట్యూబ్‌లో పోస్ట్ చేసేదాన్ని.

వాయిస్ ఆఫ్ వసపిట్ట

పిల్లల అల్లరి మాటలకు పెద్ద వాళ్లు ముద్దుగా పెట్టే పేరు వసపిట్ట. నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలని చిన్నప్పటి నుంచి కాస్త ఎక్కువగా మాట్లాడేదాన్ని. అందుకే, అందరూ నన్ను వసపిట్ట అని పిలిచేవారు. దీంతో ఛానెల్‌కి ఇదే పేరు బాగుంటుందని ఎంచుకున్నాను. మూడేళ్ల అవుతోంది ఇది స్టార్ట్ చేసి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చాక నా పోస్టులు మరిన్ని పెరిగాయి.

పెంపకాన్ని పరిచయం చేస్తూ..

అమ్మ తన పిల్లలను ఏ విధంగా పెంచుతుందనే విషయాల గురించి వెతికితే తెలుగులో ఎక్కువ బ్లాగర్స్ లేరు. ఉన్నా, వివరంగా చెప్పేవారు లేరు. పిల్లల పెంపకం అనగానే చాలా వరకు డాక్టర్లు, డైటీషియన్లు కనిపిస్తారు. వాళ్లు చెప్పేవి అందరూ ఆచరణలో పెడుతున్నారో లేదో తెలియదు. నేను డాక్టర్ దగ్గరకు పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అక్కడ వారిచ్చిన మందులు, జాగ్రత్తల నుంచి అన్నీ నా ఛానెల్ ద్వారా పరిచయం చేస్తుంటాను.



రోజువారి పనులు

చిన్న పిల్లలున్న ఇల్లు ఎలా ఉంటుందో తల్లులందరికీ అనుభవమే. ఇల్లు పీకి పందిరేస్తారు అంటుంటారు. ఇలాంటప్పుడు చిన్నపిల్లలకు క్రమశిక్షణ ఎలా అలవాటు చేయాలి, దుమ్ము, కాలుష్యం నుంచి వారిని ఎలా కాపాడాలి, టీవీ చూడకుండా తినడం ఎలా అలవాటు చేయాలి, స్క్రీన్ టైమ్ ఎందుకు తగ్గించాలి.. ఇలాంటివి పిల్లలను ఇన్‌వాల్వ్ చేసి చెప్పడం వల్ల చాలా మంది కనెక్ట్ అయ్యారు. అంతేకాదు, వాళ్లంతట వాళ్ల పనులు చేసుకోవడం, వంటలో సాయం చేయడం.. వంటివి పిల్లలకు పెద్దవాళ్లు అలవాటు చేయాలి. వీటిని మా పిల్లలను చూపిస్తూ ‘హ్యాపీ పేరెంటింగ్’ అనేది తెలియజేయాలనుకున్నాను. అదే చేస్తున్నాను.

ఆనందకరమైన లక్ష్యం

మదర్ హుడ్, ఫాదర్ హుడ్ ఎంజాయ్ చేస్తూ పిల్లలు కూడా మంచి ఫీలింగ్‌తో పెరగాలనేది నా ఆలోచన. మేం సమస్యలను ఎలా అధిగమిస్తున్నామో కూడా చూపిస్తున్నాను. వీటిని చూడటానికి నాలుగు లక్షలకు పైగా వీక్షకులున్నారు. వీరిలో పిల్లలున్నవారు 70 శాతం మంది ఉన్నారు. నా వీడియోలు చూసి తాము కూడా బ్లాగ్స్ చేస్తున్నామని కొందరు చెబుతుంటారు.

ఆరోగ్య జాగ్రత్తలు...

వీక్షకులలో చాలా మంది డాక్టరు చెప్పే జాగ్రత్తలు, కిడ్స్ ఫుడ్ గురించి సలహాలు సూచనలు అడుగుతుంటారు. పిల్లలు సరిగా తినరు అనేది పెద్దలు ప్రతిసారి చెబుతుంటారు. కానీ, ఎందుకు తినరు, ఎలా తింటారు.. అనే వివరాలను మా పిల్లలను ఉదాహరణగా చూపిస్తూ వివరిస్తుంటాను. వివిధ సమయాలలో పిల్లల ప్రవర్తన, మనం వారితో మాట్లాడటం, ప్రాక్టికల్‌గా చేస్తూ చెబుతుంటాను. పిల్లలు కూడా ఈ విధానాన్ని బాగా ఇష్టపడుతున్నారు. మా పిల్లలకు ఓ సారి ర్యాషెష్ వచ్చాయి. వాటిని ప్రాక్టికల్‌గా చూపించి, డాక్టరు చెప్పిన సూచనలతో పాటు, నేను స్వయంగా ఎలాంటి కేర్ తీసుకుంటున్నానో చూపించాను. అలాగే.. డెంటల్ ట్రీట్‌మెంట్, గర్భిణిగా ఉన్నప్పుడు, తల్లిపాల ప్రాముఖ్యత.. ఆ సమయాల్లో నేనెలాంటి జాగ్రత్తలు తీసుకున్నాను.. మరికొన్ని ఇతరుల ద్వారా సేకరించిన సూచనలూ ఇస్తుంటాను. మా నాన్న రైల్వేలో ఉద్యోగి. చిన్నప్పటి నుంచి కుటుంబంలో ప్రతి విషయంలో నా అభిప్రాయాన్ని కూడా అడిగేవారు. అలా వారి నుంచే నాకు నా పిల్లల పెంపకాన్ని మరింతగా నలుగురికి తెలియజేయాలనే ఆలోచన పెరుగుతూ వచ్చింది’’ అని తల్లిగా తన అనుభవ పాఠాలను ఆనందంగా వివరించారు మాధురి.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్



● టేబుల్ స్పూన్ పెసలను రాత్రంతా నానబెట్టి ఉదయం మెత్తగా గ్రైండ్ చేసి అందులో అర టీ స్పూన్ నెయ్యి లేదా పాలు వేసి కలిపి ముఖానికి పట్టించి మర్దన చేసి పది నిమిషాల సేపు మిశ్రమాన్ని ముఖం మీద ఉంచాలి. ఈ ప్యాక్ పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇలా చేస్తే పొడిబారిన చర్మం ఆరోగ్యంగా, నునుపుగా మారుతుంది. ఆయిల్ స్కిన్ వాళ్లయితే పెసర పేస్ట్‌లో కొద్దిగా మజ్జిగ లేదా పన్నీరు కలుపుకోవాలి.

● ఎండకు కమిలిపోయిన చర్మం తిరిగి మామూలు కావాలంటే... పైన చెప్పుకున్న పెసల పేస్టులో చల్లటి పెరుగు లేదా కలబంద పేస్టు కలిపి ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆరిపోయిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేయాలి.





● హెయిర్ ఫాల్ తగ్గాలంటే... రాత్రంతా నానబెట్టిన పెసలను గ్రైండ్ చేసి అందులో కోడిగుడ్డు సొన, టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు కలిపి చిక్కటి పేస్టు చేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి 15నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఈ మూంగ్‌దాల్ ప్యాక్‌ను నూనె రాసిన జుట్టుకు పట్టించకూడదు. షాంపూతో తలస్నానం చేసి ఆరిన తర్వాత మాత్రమే వేయాలి.

● ‘ఆడపిల్ల’కు స్వాగతం

మా ఇంటి మహాలక్ష్మి

ఆడపిల్లపుట్టిందని సంబరం చేశారు.
ఇంట్లోకి పూలతో రహదారి పరిచారు.
చిట్టి పాదాల పారాణి ముద్రలు వేశారు.
అమ్మాయి పుడితే ఇలా స్వాగతం పలకండి.

‘ఆడదే ఆధారం... మన కథ ఆడనే ఆరంభం...’ అంటూ పాడుకునే నేల మనది. ఆడపిల్ల పుట్టగానే గొంతులో వడ్ల గింజలు వేసిన నేల కూడా ఇది. తల్లి గర్భంలోనే శిశువును గుర్తించి పుట్టకముందే ప్రాణం తీస్తున్న పాపాలకూ కొదవలేదు. ఇక ఆడపిల్లను కన్న తల్లికి ఎదురయ్యే కష్టాలను ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆడపిల్ల పుట్టింది... అనగానే కోడలిపై చిర్రుబుర్రులాడే అత్తలు, భార్య–బిడ్డల ముఖం చూడని మగవాళ్లు ఉన్న సమాజం మనది. ఇన్ని దారుణాల మధ్య ఓ సంతోషవీచిక వెల్లివిరిసింది. పుట్టింది ఆడపిల్ల అని తెలియనే పండుగ చేసుకున్నారు. ఊరూ వాడా అందరినీ పిలిచి వేడుక చేసుకున్నారు. అమ్మమ్మగారింట్లో రెండు నెలలు పూర్తి చేసుకున్న బిడ్డ మూడవ నెల నానమ్మ దగ్గరకు ప్రయాణమైంది. ఆ బిడ్డనెత్తుకుని అత్తగారింటికి వచ్చిన తల్లికి పూలబాట పరిచారు అత్తింటివాళ్లు. పాపకు ఘన స్వాగతం పలికారు. ఆడబిడ్డ పుట్టడం అంటే ఇంట్లోకి లక్ష్మీదేవి రావడమేనన్నారు. ఆదర్శంగా నిలిచిన కుటుంబం తెలంగాణ, మహబూబాబాద్ జిల్లాలో ఉంది. కే సముద్రం మండలం, తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన పొడగంటి శ్రీనివాసాచారి, భద్రకాళి దంపతుల ఆదర్శవంతమైన ఆత్మీయత ఇది.


నట్టింట పాదముద్రలు వేయిస్తూ...

పాపాయిని ఎత్తుకున్న నానమ్మ



పాపాయి కోసం పూజలు

కోడలు గర్భిణి అని తెలియగానే మగ పిల్లవాడు పుట్టాలని అనుకుంటారు. కానీ భద్రకాళి కుటుంబీకులు మాత్రం ఆడపిల్ల కావాలని పూజలు చేశారు. వాళ్ల పెద్దకొడుకు సాయి కిరణ్‌కు సిరిసిల్ల పట్టణానికి చెందిన సంహితతో రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. సంహిత నెలతప్పినప్పటి నుంచి భద్రకాళి తోపాటు ఆమె తోడికోడలు సుమ, మరదలు రమ్య కూడా ఆడపిల్లలు పుట్టాలని వ్రతాలు, పూజలు చేశారు. వాళ్లందరికీ మగపిల్లలే. ఈ తరంలోనైనా ఇంట్లో ఆడపిల్ల కావాలని వాళ్ల కోరిక. ప్రసవం రోజు వరంగల్‌లో ఆసుపత్రికి ఇంటిల్లిపాది తరలి వెళ్లారు. ఆడపిల్ల పుట్టిందని తెలియగానే సంతోషంగా కేకలు వేస్తూ, హాస్పిటల్‌లో అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

అపూర్వ స్వాగతం

కోడలు పుట్టింటికి వచ్చిన రోజు ఇంటిని పూలతో అలంకరించారు. ముత్తయిదువలతో స్వాగతం పలికారు. చిన్న పాప కాళ్లకు పారాణి రాసి తొలి అడుగుల గుర్తులు నట్టింట్లో ముద్రించుకున్నారు. ఆ అడుగులను కళ్లకు అద్దుకున్నారు. ఆ జ్ఞాపకం కలకాలం నిలిచి ఉండడానికి ఫొటోలు తీశారు.

– ఈరగాని భిక్షం, సాక్షి, మహబూబాబాద్

నా కోరిక తీరింది

నాకు చిన్నప్పటి నుండి ఆడపిల్లలంటే ఇష్టం. మా వారు కూడా ఆడపిల్ల ఉన్న ఇంటి అందమే వేరు అంటూ ఉంటారు. అందుకోసమే మా ఇంటి చుట్టుపక్కల ఉన్న ఆడ పిల్లలను ప్రతి పండుగకు పిలుస్తాం. వారు చేసే సందడి చూసి సంబర పడుతాం. మా ఇంట్లో ఆడపిల్ల ఉండాలనే కోరిక నెరవేరింది. అందుకోసమే అలా స్వాగతం పలికాం.

– భద్రకాళి,
పాపాయి నానమ్మ


పాపాయితో అమ్మానాన్నలు సంహిత, సాయికిరణ్


● సృజన

అలా అడవి దారి పట్టింది

‘గరిమ పుర ఎవరు?’ అనే ప్రశ్నకు చాలా మంది జవాబు చెప్పలేకపోవచ్చు.
ఆస్కార్ అవార్డ్ గెలుచుకున్న ‘ది ఎలిఫెంట్ విస్పరర్స్’ గురించి తెలియని వారు తక్కువ మంది ఉండవచ్చు.
27 సంవత్సరాల గరిమ ఈ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్‌కు స్క్రిప్ట్‌రైటర్...


గరిమ పుర

పంజాబ్‌లోని పటియాలాలో పుట్టిన గరిమ హైస్కూల్ చదువు పూర్తికాగానే కళాశాల విద్య కోసం మహారాష్ట్రలోని పుణెకు వచ్చింది. అక్కడే తనకు ప్రపంచ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలపై ఆసక్తి ఏర్పడింది. ‘సింబియాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మీడియా’లో పట్టా పుచ్చుకున్న తరువాత డాక్యుమెంటరీలపై మరింత ఆసక్తి పెరిగింది.



డాక్యుమెంటరీలు తీయాలనుకొని ముంబైలో అడుగు పెట్టిన గరిమ ఒక మీడియా సంస్థలో చేరింది. ‘వృత్తి జీవితం బాగానే ఉందిగానీ తాను వచ్చింది ఇందు కోసం కాదు కదా!’ అని ఆలోచించింది. ఎనిమిది నెలల తరువాత ఉద్యోగాన్ని వదులుకొని స్క్రిప్ట్ రైటర్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టింది.

ఆ ప్రయత్నాలు ఫలించి వెబ్ సిరీస్‌కు రాయడం మొదలుపెట్టింది.

నెట్‌ఫ్లిక్స్ సిరీస్ ‘లిటిల్ థింగ్స్’తో రైటర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది గరిమ. పట్టణ ప్రజల జీవనశైలిపై తీసిన ఈ సిరీస్ కోసం తొలిసారిగా ఇతర రచయితలతో కలిసి పనిచేసింది.

ఒంటరిగా కూర్చుని, నిశ్శబ్ద వాతావరణంలో రాసే అలవాటు ఉన్న గరిమ ఇతర రచయితలతో కలిసి చర్చలు చేస్తూ రాయాల్సి వచ్చింది.

‘ఇతరులతో కూర్చొని చర్చిస్తూ రాయడం వల్ల మనల్ని మనం ఎంతో మెరుగు పరుచుకోవచ్చు. ఇలా కూడా ఆలోచించవచ్చా అనిపిస్తుంది. స్థూలంగా చెప్పాలంటే కలానికి కొత్త మెరుపు వస్తుంది’ అంటుంది గరిమ.

2019లో వైల్డ్‌లైఫ్ డైరెక్టర్ గుంజన్ మీనన్ గరిమను డైరెక్టర్ కార్తికీ గోంజాల్వెజ్‌కు పరిచయం చేసింది. కార్తికీ దగ్గర ఒక మంచి కథ ఉంది. ఆమె మంచి రైటర్ కోసం వెదుకుతోంది. కట్ చేస్తే...

2020లో గరిమను వెదుక్కుంటూ కార్తికీ వచ్చింది. ఇక అప్పటి నుంచి స్క్రిప్ట్ రైటింగ్ పనుల్లోకి దిగింది గరిమ. అయితే ఇదేమీ కాల్పనిక స్క్రిప్ట్ కాదు. నాలుగు గోడల మధ్య ఏకాంతంగా రాసుకునే స్క్రిప్ట్ కాదు. అడవి దారి పట్టాలి. అనాథ ఏనుగుల కళ్లలోకి చూసి మౌనంగా మాట్లాడాలి. వాటిని సొంత పిల్లల్లా ఆదరించిన దంపతుల మనసు పొరల్లోకి వెళ్లాలి. తెలుసుకున్నదానికి సృజన జోడించాలి.

‘30 ఏళ్లు కూడా దాటని ఈ అమ్మాయి ఇంత పనిచేయగలదా?’ అనే సందేహం ఎప్పుడూ కార్తికీ గోంజాల్వెజ్‌కు రాలేదు. తనపై కార్తికీ పెట్టిన నమ్మకాన్ని గరిమ వృథా చేసుకోలేదు. స్క్రిప్ట్‌కు జవసత్వాలు ఇచ్చింది.

‘కాలం మారింది. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల పుణ్యమా అని యువతరం చిత్రపరిశ్రమలోకి వెల్లువలా వస్తోంది. ఇప్పుడు ఒకరి సృజనాత్మక శ్రమను దోచుకోవడం అనేది కష్టం. కష్టపడే వారికి విజయం త్వరగా చేరువయ్యే కాలం ఇది’ అంటోంది గరిమ.

అలనాటి పుస్తకాల నుంచి తాజాగా విడుదలైన పుస్తకాల వరకు ఎన్నో పుస్తకాలు చదువుతుంటుంది గరిమ.

1973లో వచ్చిన ఎరిక జోంగ్ ‘ఫియర్ ఆఫ్ ఫ్లైయింగ్’ పుస్తకం అన్నా, అందులో జోంగ్ రాసిన వాక్యం... ‘ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుంది. అయితే అరుదైన ప్రతిభ అనేది మనం ఎంత సాధన చేస్తున్నాం, ఎంత కష్టపడుతున్నాం అనేదానిపైనే ఆధారపడి ఉంటుంది’ అనే వాక్యం అన్నా ఆమెకు చాలా ఇష్టం.

కిచెన్ టిప్స్



● ఒక్కోసారి ఇంట్లో చీమలు పుట్టలు పెడుతుంటాయి. వాటిని వదిలించుకోవడం చాలా కష్టం. ఎండాకాలం వచ్చిందంటే నల్లచీమల బెడద ఎక్కువ. ఇవి కుట్టవు కానీ చికాకు పెడతాయి. వాటిని వదిలించుకోవాలంటే బట్టల సబ్బు లేదా స్నానపు సబ్బును తురిమి అవి వచ్చే దారిలో వేయాలి. పుట్ట దగ్గర వేస్తే వాటికి సబ్బు ఘాటు పడదు కాబట్టి వెంటనే పారిపోతాయి.

● అల్లం వెల్లుల్లి ముద్ద చేసి పెట్టుకుంటాం కదా.. వాటిని మిక్సీలో వేసేటప్పుడు కాస్తంత



నూనె వేస్తే అల్లం వెల్లుల్లి పేస్టు మృదువుగా రావడమే కాకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది కూడా.

● ధనియాలను వేయించి చల్లార్చి డబ్బాలో నిల్వ చేస్తే పురుగు పట్టకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.



● ఒకోసారి ఎక్కువ మొత్తంలో కరేపాకు తెచ్చుకుంటాం. ఎంత జాగ్రత్త చేసినా అది ఎండిపోతుంటుంది. అదేవిధంగా ఒకోసారి కూరలో వెయ్యాలంటే కాసింత కూడా కరేపాకు దొరకదు. అలాంటప్పుడు కరివేపాకును నూనెలో వేయించి చల్లారాక సీసాలో నిల్వ ఉంచుకుంటే ఏదైనా కూర చేసుకున్నప్పుడు ఈ కరేపాకు కలిపితే మంచి రుచి వస్తుంది.



● పేరెంటింగ్

లాలన... పాలన



ఈ రోజుల్లో పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కూడా ఒత్తిడితో జీవిస్తున్నారు ముఖ్యంగా పెద్దలు డిప్రెషన్ లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్న నేపథ్యంలో చిన్న పిల్లలు కూడా తీవ్రస్థాయిలో ఈ ఒత్తిడికి గురవుతున్నారు కాబట్టి తల్లిదండ్రులు పిల్లలు పెంచే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కోసం...

సాధారణంగా ప్రతి తల్లీ తండ్రీ చేసే పొరపాటు ఇతరులతో తతమ పిల్లల్ని పోల్చడం. అలా పోల్చని వాళ్లని వేళ్ళ మీద లెక్క పెట్టచ్చు. పక్కింటి చింటూ చూడు. ఎంత బుద్ధిగా ఉంటాడో, నువ్వే ఇంత అల్లరి చేస్తున్నావు అనో, ఫలానా వాళ్ల పాప చూడు. ఎంత బాగా చదువుతుందో, నువ్వసలు పుస్తకం ముట్టవు అనో... ఇలా మరొకరితో మీ పిల్లలకి పోలిక చెప్పడమంటే వాళ్ళని లెక్కలేకుండా చూడడమేనని. దానివల్ల వారు తమ ప్రవర్తనను మార్చుకోకపోగా, మరింత దూకుడుగా, అల్లరిగా ప్రవర్తిస్తారని చైల్డ్ సైకాలజిస్టులు చెబుతున్నారు. పోల్చి చెప్పడం వల్ల వారిలో అనవసరమైన ఈర్ష్య, అసూయలు పెరుగుతాయనీ, అందుకే పోలికల జోలికి పోకూడదని చెబుతారు.

పెద్దవాళ్ల దగ్గర ఉంచడం మేలు

పిల్లలను ఇంట్లో ఒంటరిగా ఉంచకుండా వారి అమ్మమ్మలు, తాతయ్యలతో కలిపి ఉంచడం మేలు. దీంతో వారు పెద్దల నుంచి ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంటారు. ఇక పిల్లల భద్రత గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మరేం చేయాలి?

మన బంగారాలని వాళ్లతో వీళ్లతో పోల్చి చెప్పడానికి బదులు మీకు వాళ్ళెంత ప్రత్యేకమో, వాళ్ళంటే ఎంత ఇష్టమో చెప్పండి. మీ పిల్లలు వాళ్ళల్లో వాళ్ళు కూడా ఎలాంటి పోలికలూ పెట్టుకోకుండా చూడటం కూడా ముఖ్యం.

సరదాగా గడపండి

మీకు సమయం దొరికినప్పుడు, పిల్లలతో సరదాగా గడపండి. ఆ సమయంలో మీరు ఉద్యోగాలు చేస్తూ ఎందుకు కష్టపడుతున్నారో పిల్లలకు వివరించండి. దీనివల్ల మీ పిల్లల భావోద్వేగాలు మీకు బాగా తెలుస్తాయి. తద్వారా పిల్లలు కూడా మీకు మద్దతు ఇవ్వడానికి తమ వంతు ప్రయత్నం చేస్తారు. మీరు ఆఫీస్ నుండి తిరిగి వచ్చాక, మీ పిల్లలతో సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని కేటాయించండి. ఇక వారంతాల్లో పూర్తి సమయాన్ని వారికే కేటాయించండి. పిల్లలతో విభిన్న పనులు ప్లాన్ చేయండి. వారికి ఇష్టమైన పనులు, వంటలు చేసి పెట్టండి. పిక్నిక్‌కి, పార్క్‌కి, సినిమాలకు తీసుకెళ్లండి.

బ్రహ్మాస్త్రం వేయకండి

కొంతమంది తల్లిదండ్రులు పిల్లల విషయంలో అతి జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు ఇది మాత్రం అంత మంచి పద్ధతి కాదు. ఎందుకంటే పిల్లలు తప్పు చేయడం సహజం. అలా తప్పు చేశారన్న కోపంతో వారిని కఠినంగా దండించామనుకోండి, ఆ తప్పును కప్పి పుచ్చడం కోసం ఇంకా అనేక తప్పులు చేస్తారు. అందువల్ల వారు ఏదైనా తప్పు చేసినప్పుడు ఒకటికి రెండుసార్లు ఓపిగ్గా చెప్పి చూడండి. అలా చెప్పినప్పటికీ మారకపోతే అప్పుడు దగ్గర కూర్చోబెట్టుకుని స్వరం పెంచి మాట్లాడండి. అంతే కానీ చిన్న తప్పు చేసినా పిల్లలపై మీ ప్రతాపం చూపించడం వల్ల వారు తీవ్ర అభద్రతా భావానికి లోనవుతారు.

టైమ్ టేబుల్ సెట్ చేయండి...

పిల్లలు ఒక వయసుకు వచ్చిన తర్వాత ఇంట్లో ఒంటరిగా వదిలివెళుతున్నప్పుడు వారికి ఒక నిర్దిష్టమైన టైమ్ టేబుల్‌ను సెట్ చేయాలి. ఎప్పుడు చదవాలి? ఎప్పుడు తినాలి? ఎప్పుడు ఆడుకోవాలి? ఎప్పుడు పడుకోవాలి... తదితర విషయాలకు వారితో మాట్లాడి అన్నిటికీ టైం ఫిక్స్ చేయండి. పిల్లలు కచ్చితంగా ఈ టైం టేబుల్‌ను పాటించేలా చూడండి. ఇక వారి వస్తువులను వారే సర్దిపెట్టుకునేలా, వారి పనులు వారే చేసుకునేలా అలవాటు చేయండి. ఇక ఆఫీసుకు వెళ్లినా ఇంట్లోని పిల్లల పరిస్థితి గురించి అడగడానికి అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ ఉండండి.

ప్లే గ్రౌండ్‌కు పంపండి

పిల్లలకు కాసిని మార్కులు తక్కువ వచ్చాయని వారిని వత్తిడి చేయద్దు. ఎందుకంటే కేవలం మార్కుల కోసం చదివే చదువుల వల్ల పిల్లలు అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ర్యాంక్స్ కోసం ఐదో తరగతి నుంచే ప్లే గ్రౌండ్ కి దూరంగా టాబ్లెట్స్, కంప్యూటర్స్ ముందు కూర్చో పెట్టి కంప్యూటర్ కోడింగ్ సైతం నేర్పిస్తున్నారు. దీనివలన పిల్లల భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. పిల్లలు చిన్నప్పటినుంచి ప్లే గ్రౌండ్‌లో ఆటలు ఆడుకునే విధంగా ప్రోత్సహించాలి. ప్లే గ్రౌండ్‌లో ఆడుకోకుండా ఇంట్లో కూర్చుని కంప్యూటర్ గేమ్స్ ఆడుకునేలా మాత్రం వారిని ఎంకరేజ్ చేయద్దు. కంప్యూటర్ గేమ్స్ ఎప్పుడైనా ఆడుకుంటే ఫరవాలేదు కానీ, వారికి శారీరక వ్యాయామం, ఉత్సాహం కావాలంటే మాత్రం ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి. శారీరకంగా చురుగ్గా ఉంటే మానసికంగా కూడా చురుగ్గా ఉంటారు.

ఇచ్చి పుచ్చుకోవడం నేర్పండి

చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు పిల్లలకు ఆత్మాభిమానంతో జీవించడం, పెద్దలకు గౌరవం ఇవ్వడం నేర్పించాలి. గౌరవంగానీ, ప్రేమ కానీ మనం ఇతరులకు ఇస్తేనే మనకు తిరిగి వస్తాయని చెప్పాలి. తద్వారా వారు భవిష్యత్తులో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడమే కాకుండా సమాజం పట్ల మంచి ప్రేమను కనబరుస్తారు. అదేవిధంగా తోటి పిల్లలతో వ్యత్యాసాలు చూసుకోకుండా సమానంగా నడుచుకునే విధంగా విలువలతో జీవించడం నేర్పాలి. సాధారణంగా చాలామంది పిల్లలు మనం చెప్పే మాటలు వినరు, కానీ మనం చేసేవి చూసి అలానే చేస్తారు. అందువల్ల మన పిల్లల ముందు మన నడవడిక బాగుండాలని గుర్తుంచుకోండి.

రుచికే కాదు.. ఆరోగ్యానికి కూడా...

ఆరోగ్యాన్ని ఇచ్చే పండ్లు అంటే ఎక్కువ మంది యాపిల్ గురించి మాట్లాడతారు. కానీ దానితో సమానంగా దానిమ్మ కూడా ఆరోగ్యాన్ని ఇస్తుందనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. దీనివల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

చాట్, స్వీట్ డిష్, ఐస్ క్రీమ్, స్మూతీస్ ఇలా ఏది చేసినా దాని మీద తప్పనిసరిగా గార్నిషింగ్ కోసం దానిమ్మ గింజలను ఉపయోగిస్తారు. ఎందుకంటే ఏదోవిధంగా దానిమ్మను తీసుకోవడం వల్ల ధమనుల్లో కొవ్వు చేరకుండా చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని అనుకుంటే తప్పకుండా దానిమ్మ పండ్లు తినడం అలవాటు చేసుకోండి.




దానిమ్మ వల్ల ప్రయోజనాలు...

- దానిమ్మ మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది. రోగనిరోధక శక్తిని ఇస్తుంది. పోషకాలతో నిండి ఉంటుంది. తక్కువ కేలరీలు, కొవ్వు ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వ్యాధులను నిరోధించేందుకు సహాయపడతాయి. వృద్ధాప్యానికి దారి తీసే ఫ్రీ రాడికల్స్ నుంచి మనలని రక్షిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ ని తగ్గిస్తుంది. శరీరం నుంచి అదనపు కొవ్వుని తొలగించడంలో సహాయ పడుతుంది.
- రక్తాన్ని పలుచన చేసి రక్తం గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. శరీరం లోని ఆక్సిజన్ స్థాయిలను మెరుగుపరిచి రక్తప్రసరణకి ఎటువంటి హాని కలగకుండా చూస్తుంది.
- జీర్ణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూస్తుంది. ప్రతిరోజు ఒక దానిమ్మ పండు తింటే మలబద్ధకం సమస్య దరి చేరదు.
- దానిమ్మలోని గుణాలు ధమనుల్లో ఆక్సీకరణ ఒత్తిడిని, వాపును తగ్గిస్తాయి. దానిమ్మ రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. గుండె పోటు, స్ట్రోక్ రాకుండా అడ్డుకుంటుంది.
- అధిక రక్తపోటుతో బాధపడే వాళ్ళు కనీసం మూడు నెలల పాటు ప్రతి రోజు మూడు దానిమ్మ పండ్లు తింటే చాలా మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కార్డియో వాస్కులర్ డిసీజ్ బారిన పడకుండా కాపాడుతుంది.
- రక్తహీనత సమస్య ఉన్న వాళ్ళు మందులు వాడే ముందు రోజూ దానిమ్మను తిని చూడటం ఉత్తమం. ఎందుకంటే దానిమ్మ ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచుతుంది.
- దానిమ్మ పండులోనే కాదు తొక్కల్లో కూడా విటమిన్ ఏ, సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి6 పోషకాలు ఉన్నాయి. అందుకే దానిమ్మ గింజలు తిన్నతర్వాత తొక్కలు పడేయకుండా వాటిని ఎండబెట్టి పొడి చేసుకుని పెట్టుకోండి.
- కీళ్ల నొప్పులతో బాధపడే వాళ్ళు దానిమ్మ తొక్కలు ఎండబెట్టుకుని చేసుకున్న పొడిని నీళ్ళలో వేసి మరిగించి తాగితే మంచిది.
- దానిమ్మ తొక్కల పొడిని వేడి నీళ్ళలో కలిపి పేస్ట్ లా చేసుకుని ముఖానికి రాసుకుంటే మొటిమల సమస్యను అధిగమించవచ్చు.

● ఆరోగ్యాహారం

ఒత్తిడిని తినేయండి



మానసిక ఆరోగ్యం బాగుండాలంటే కొన్ని రకాల పోషకాలను తప్పకుండా తీసుకోవాలి. దానికి పిల్లలు, పెద్దలు అనేం లేదు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలలో మానసికంగా చురుగ్గా ఉంచే కొన్ని కారకాలు ఉన్నట్లు పోషకాహార నిపుణులు గుర్తించారు. వాటిని తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి చురుగ్గా ఉండగలం. అవేమిటో చూద్దాం.

మానసిక ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు, డిప్రెషన్.. పేరు ఏదైనా వచ్చిన తర్వాత బాధ పడేకంటే రాకుండా చూసుకోవడం చాలా మేలు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలు తీసుకోండి. శారీరకంగానే కాదు, మానసికంగానూ ఆరోగ్యంగా ఉండండి.



పొద్దుతిరుగుడు గింజలు... వీటిలో విటమిన్ 'ఇ' అధిక స్థాయిలో ఉంటుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది.



వెల్లుల్లి... వెల్లుల్లిలో సల్ఫర్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గ్లటాథియోన్ అనే యాంటీ ఆక్సిడెంట్‌ను ఉత్పత్తిచేస్తాయి. ఇది ఒత్తిడిని ఎదుర్కొనే రక్షణ ఛత్రంలో మొదటి మూలకంగా పనిచేస్తుంది.

గుడ్లు... గుడ్లలో పోషకాలు పుష్కలం అనే విషయం తెలిసిందే. వీటిలో విటమిన్లు, మినరల్స్, అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్స్ సంతృప్త స్థాయిలో లభిస్తాయి. ప్రత్యేకంగా ఇందులో చోలిన్ అనే పోషకం పుష్కలంగా ఉంటుంది. ఇది మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుందని, అలాగే ఒత్తిడి నివారణకు సమర్థంగా పనిచేస్తుందని వైద్యులు గుర్తించారు.

నువ్వులు... నువ్వులతో తయారుచేసే పదార్థాలలో ఎల్-ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం పాళ్లు ఎక్కువ. ఇది మనసును ఉల్లాసంగా ఉంచే డోపమైన్, సెరటోనిన్ ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది. అలాగే ఒత్తిడిని తగ్గించేందుకు తోడ్పడుతుంది. 25 మంది యువకులకు నాలుగు రోజుల పాటు నువ్వుల ఉండలను తినిపించి పరిశీలించినప్పుడు వారిలో ఆందోళన, ఒత్తిడి స్థాయిలు గణనీయంగా తగ్గినట్లు ఓ సర్వేలో తేలింది.



నువ్వులతో రకరకాల స్నాక్స్ తయారు చేసుకోవచ్చు. ఏదైనా పదార్థాన్ని రుచిగా ఉండేలా తయారు చేసుకోవడం వల్ల వాటిని తినే విధంగా మెదడు కూడా మనల్ని ప్రోత్సహిస్తుంది.

సినిమా

నాటు నాటు ప్రజల పాట

\- రామ్‌చరణ్

లాస్ ఏంజిల్స్‌లో ఇటీవల జరిగిన 95వ ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవంలో 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్ అవార్డులను అందుకున్న విషయం తెలిసిందే. ఈ అవార్డు వేడుక కోసం లాస్ ఏంజిల్స్ వెళ్లిన దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి, కాస్ట్యూమ్ డిజైనర్ రమా రాజమౌళి, తనయుడు కార్తికేయ, సంగీత దర్శకుడు కీరవాణి, గాయకుడు కాలభైరవ, నటుడు శ్రీ సింహా తదితరులు శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. కాగా ఆస్కార్ అవార్డు సాధించడం గురించి రాజమౌళిని స్పందించమని విలేకర్లు అడగ్గా.. ఆయన 'జైహింద్' అన్నారు. ఇక ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు లాస్ ఏంజిల్స్ నుంచి శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు రామ్‌చరణ్. 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడం గురించి స్పందిస్తూ– ''భారతీయ అభిమానులందరూ 'ఆర్‌ఆర్‌ఆర్'ను ఆదరించారు. 'నాటు నాటు' పాటను సూపర్ హిట్ చేశారు. 'నాటు నాటు' పాట మాది కాదు.. ప్రజల పాట. ప్రేక్షకుల అభిమానమే ఆస్కార్‌కి దారి వేసింది, అవార్డు వరించేలా చేసింది. వారితో పాటు కీరవాణి, చంద్రబోస్, రాజమౌళిగార్లకి కూడా థ్యాంక్స్ చెబుతున్నాను'' అని పేర్కొన్నారు రామ్‌చరణ్.



● రామ్‌చరణ్

తప్పుగా అర్థం చేసుకున్నారు: కాలభైరవ

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను పాడినందుకు ఆనందంగా ఉందంటూ ఓ నోట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు కాలభైరవ. ''ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను ప్రదర్శించినందుకు గర్వపడుతున్నాను. నాకు ఈ విలువైన క్షణాలు దక్కడానికి రాజమౌళి బాబా, నాన్న (కీరవాణి), కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్ మాస్టర్, కార్తికేయ అన్న, అమ్మ, పెద్దమ్మ... ఇలా మరి కొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారణమయ్యారు. యూఎస్ టీమ్ కూడా హెల్ప్ చేసింది. వీరి సహకారం, ప్రోత్సాహం లేకపోతే ఆస్కార్ వేదికపై నా ప్రదర్శన వీలయ్యేది కాదు'' అని ఆ నోట్‌లో చెప్పు కొచ్చారు కాలభైరవ. కాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ల పేర్లను కాలభైరవ ప్రస్తావించకపోవడంతో ఈ ఇద్దరి హీరోల అభిమానులు, కొందరు నెటిజన్లు తప్పుబడుతూ కామెంట్స్ చేశారు. దీంతో ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా కాలభైరవ స్పందించారు. ''ఆర్‌ఆర్‌ఆర్' సినిమా, ఇందులోని 'నాటు నాటు' పాట సక్సెస్‌కు తారక్ అన్న, చరణ్ అన్న ముఖ్యులు. అందులో సందేహం లేదు. అయితే నేను ఆస్కార్ వేదికపై నా ప్రదర్శనకు సంబంధించిన విషయం గురించి మాత్రమే ఆ నోట్‌లో ప్రస్తావించాను. అది తప్పుగా అర్థమైనట్లుంది. అయినప్పటికీ నా మాటలను క్షమించమని అడుగుతున్నాను'' అని కాలభైరవ పేర్కొన్నారు.



● కాలభైరవ

ఆస్కార్ వేదికపై షాక్ అయ్యా: గునీత్ మోంగా

'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో ఆస్కార్ అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంటరీ నిర్మాత గునీత్ మోంగా శుక్రవారం ముంబై చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మామూలుగా ఆస్కార్ అవార్డు అందుకున్నవారు తమ యాక్సెప్టెన్సీ స్పీచ్‌ను 45 సెకన్లలో పూర్తి చేయాలి. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' దర్శకురాలు కార్తీకి అన్ని సెకన్లలోనే పూర్తి చేశారు. కానీ నిర్మాత గునీత్ మోంగా కాస్త ఎక్కువ టైమ్ తీసుకుని మాట్లాడుతుండగా స్పీచ్ ఆపాలన్నట్లుగా వెనకనుంచి మ్యూజిక్ ప్లే చేశారు ఆస్కార్ నిర్వాహకులు. అలాగని నిర్వాహకులు ఈ 45 సెకన్ల నియమంలో కఠినంగా ఏమీ లేరు. బెస్ట్ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ అవార్డు గెల్చుకున్న చార్లీ మాక్సే, మ్యాథ్యూ ఫ్రాండ్‌లు 45 సెకన్ల కన్నా ఎక్కువగా మాట్లాడినా, నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఈ విషయంపై గునీత్ మోంగా స్పందించారు. ''ఇండియాకు తొలి ఆస్కార్ అవార్డును సాధించామనే గొప్ప విషయం గురించి చాలా మాట్లాడాలనుకున్నాను. కానీ నా స్పీచ్‌ను కట్ చేశారు. షాక్ అయ్యాను. ఇండియా తరఫున నేను మాట్లాడే అవకాశాన్ని నా నుంచి ఎవరో లాగేసుకున్నట్లుగా అనిపించింది. నేను మళ్లీ ఆస్కార్‌కు వెళతాను. అప్పుడు తప్పకుండా నా గొంతు మళ్లీ వినిపిస్తాను'' అని పేర్కొన్నారు గునీత్.



● గునీత్ మోంగా

ఆర్‌ఆర్‌ఆర్... నెంబర్ 3

భారతీయ చిత్రాల్లో అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన జాబితాలో 'ఆర్‌ఆర్‌ఆర్' మూడోస్థానంలో నిలిచింది. ఇదివరకు ఈ స్థానంలో 'కేజీఎఫ్: చాప్టర్ 2' ఉండేది. తొలుత అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన ఇండియన్ చిత్రాల జాబితాలో వరుసగా 'దంగల్' (దాదాపు రూ. 1900 కోట్లు), 'బాహుబలి: ది కన్‌క్లూజన్'(రూ. 1800 కోట్లు), 'కేజీఎఫ్: చాప్టర్ 2' (రూ. 1230 కోట్లు), 'ఆర్‌ఆర్‌ఆర్' (దాదాపు రూ. 1150 కోట్లు), 'పఠాన్' (రూ. 1050 కోట్లు.. ఇంకా ప్రదర్శితమవుతోంది) ఉన్నాయి.

అయితే గత ఏడాది అక్టోబరులో జపాన్‌లో విడుదలైన 'ఆర్‌ఆర్‌ఆర్' ఇప్పటికీ ప్రదర్శితమవుతోంది. జపాన్ బాక్సాఫీస్ వద్ద 'ఆర్‌ఆర్‌ఆర్' ఇప్పటివరకు రూ. 80 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. అలాగే 'ఆస్కార్' ప్రచారంలో భాగంగా అమెరికాలో ఈ నెల 3న, తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 10న 'ఆర్‌ఆర్‌ఆర్'ను రీ రిలీజ్ చేశారు. దీంతో మరికొన్ని కలెక్షన్స్ వచ్చాయి. ఈ వసూళ్లు మొత్తాన్ని కలిపితే 'కేజీఎఫ్: చాప్టర్ 2' గ్రాస్ కలెక్షన్స్‌ను 'ఆర్‌ఆర్‌ఆర్' దాటిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

అందుకే విశ్వక్ డైరెక్షన్ మానేయాలి

\- ఎన్టీఆర్



● కరాటే రాజు, ఎన్టీఆర్, విశ్వక్‌సేన్, నివేదా పేతురాజ్

''సినిమా పట్ల విశ్వక్ సేన్‌కి ఎంతో పిచ్చి ఉంది. ఆ పిచ్చి తగ్గిపోకూడదు. ఇలాంటివాళ్లను ప్రోత్సహిస్తేనే పరిశ్రమ ఇంకా ముందుకెళుతుంది. 'దాస్ కా ధమ్కీ' హిట్ అవ్వాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. కరాటే రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన 'దాస్ కా ధమ్కీ' ఈ నెల 22న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''ఒకే చట్రంలో ఇరుక్కుపోతున్నానని చాలా కాలం తర్వాత రియలైజ్ అయిన నేను, మీరు (అభిమానులు) కాలర్ ఎత్తుకునే సినిమాలు చేస్తానని మాట ఇచ్చాను.. ఆ మాట అన్నప్పుడే నటుడిగా నేను మళ్లీ పుట్టాను. వైవిధ్యమైన నటన కోసం నేను తాపత్రయపడుతున్నాను కాబట్టే మిమ్మల్ని కాలర్ ఎగరేసుకునేలా చేస్తున్నానని అనుకుంటున్నాను. విశ్వక్ కూడా ఒకే తరహా పాత్రల నుంచి బయటికొచ్చి, కొత్తగా చేస్తున్నాడు. 'దాస్ కా ధమ్కీ' బ్లాక్ బస్టర్ అవ్వాలి. ఆ తర్వాత తను దర్శకత్వం మానేయాలి. ఎందుకంటే కొత్త యువ దర్శకులకు నీలాంటి వాళ్లు అవకాశాలు ఇవ్వాలి. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రపంచ చిత్ర పటంలో ఆల్‌టైమ్ టాప్‌లో ఉంది. 'ఆర్‌ఆర్‌ఆర్' ఈ రోజు ప్రపంచ చిత్రపటంలో నిలబడిందంటే, ఆస్కార్ అవార్డుని సొంతం చేసుకుందంటే దానికి మా యూనిట్‌తో పాటు యావత్ తెలుగు, భారతదేశ చిత్రపరిశ్రమ, ప్రేక్షక దేవుళ్లు కూడా కారణం. కీరవాణి, చంద్రబోస్‌గార్లు ఆస్కార్ అవార్డు తీసుకుంటున్నప్పుడు నాకు వాళ్లు కనిపించలేదు.. ఇద్దరు భారతీయులు కనిపించారు.. ఇద్దరు తెలుగువాళ్లు కనిపించారు'' అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఇండియాలో బెస్ట్ యాక్టర్ ఎవరంటే ఎన్టీఆర్ అన్న అని నేను ఎప్పుడో చెప్పాను. నా సినిమాని ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ వచ్చాడు. ఆయన రాకతో నా సినిమా బ్లాక్‌బస్టర్ స్టార్ట్ అయిపోయినట్లే'' అన్నారు. ''ఫలక్‌నుమా దాస్' తీసినప్పుడు మా అబ్బాయి విశ్వక్ ఎవరికీ తెలియదు. ఎంతో పబ్లిసిటీ చేసి, సినిమా విడుదలకి ముందే స్టార్‌డమ్ తెచ్చుకున్నాడు. 'దాస్ కా ధమ్కీ' కోసం 15 నెలలు కష్టపడ్డాడు'' అన్నారు కరాటే రాజు.

మా నమ్మకం నిజమైంది



● హర్షిత్ రెడ్డి, హన్షిత

''ప్రతి ఊరిలో, ప్రతి కుటుంబంలో జరిగే కథే 'బలగం'. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని వేణు కథ చెప్పినప్పుడే నమ్మాం. అది నిజమైంది'' అని నిర్మాతలు హర్షిత్ రెడ్డి, హన్షిత ('దిల్' రాజు కుమార్తె) అన్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా వేణు ఎల్దండి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా హన్షిత మాట్లాడుతూ– ''శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై నాన్నగారు ('దిల్' రాజు) తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో భారీ సినిమాలు నిర్మిస్తున్నారు. ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించడంతో పాటు ప్రయోగాత్మక, వైవిధ్యమైన కథలను చిన్న సినిమాల ద్వారా ప్రేక్షకులకు అందివ్వాలనే 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్‌ని స్థాపించాం. 'బలగం'ని ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లో చూశాక నాన్నగారు 'మీరు ఎన్ని సినిమాలు తీసినా 'బలగం' మాత్రం గుర్తుండిపోతుంది' అని అభినందించారు'' అన్నారు. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ– ''బలగం' చిత్రానికి రోజురోజుకు వసూళ్లు పెరుగుతున్నాయి. మా తొలి సినిమాకే ఇంత మంచి పేరు రావడం హ్యాపీ. ప్రస్తుతం యష్ మాస్టర్ హీరోగా శశి అనే కొత్త డైరెక్టర్‌తో ఓ సినిమా నిర్మిస్తున్నాం'' అన్నారు.

బికిలి అంటే..?



● విజయ్ ఆంటోని

'వీళ్లే బికిలి బికిలి బిలి బిలి.. బికిలి బికిలి బిలి బిలి...' అంటూ పాడారు విజయ్ ఆంటోని. 2016లో విజయ్ ఆంటోని హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'పిచ్చైక్కారన్' తెలుగులో 'బిచ్చగాడు'గా విడుదలై ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. శశి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఇప్పుడు 'బిచ్చగాడు'కు సీక్వెల్‌గా 'బిచ్చగాడు 2' వస్తోంది. విజయ్ ఆంటోని నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'బికిలి' అనే పాట మ్యూజిక్ వీడియోను రిలీజ్ చేశారు. భాష్యశ్రీ రాసిన ఈ పాటకు మ్యూజిక్ కంపోజింగ్, సింగర్ విజయ్ ఆంటోనీయే కావడం విశేషం. ఇక పేదవాళ్ల పేదరికాన్ని ఉపయోగించుకుని తన ధనబలంతో వారిని బానిసలుగా చేసి, డబ్బు ఉందన్న అహంకారంతో తిరిగే వాళ్లకు తాను బికిలీ అని పేరు పెట్టినట్లు విజయ్ ఆంటోని పేర్కొన్నారు.


కామెడీ.. యాక్షన్



● యోగేశ్వర్, సుమన్, జీవీవీ గిరి

యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారీ'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్ లీడర్ అంజన్ కుమార్ యాదవ్, నటుడు సుమన్, నిర్మాత ప్రసన్న కుమార్ ట్రైలర్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ చంద్ర మహేష్, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, ప్రతాని రామకృష్ణ గౌడ్ థియేట్రికల్ ప్రోమోను, నటి కవిత సాంగ్ ప్రోమోను రిలీజ్ చేశారు. ''మంచి కథ, కథనాలతో నిర్మించిన మా 'పరారీ' అందర్నీ మెప్పిస్తుంది'' అన్నారు జీవీవీ గిరి. ఈ చిత్రానికి సంగీతం: మహిత్ నారాయణ్.

వైరానికి సిద్ధం



● మోనాల్, ప్రణమ్

నటుడు దేవరాజ్ తనయుడు ప్రణమ్ దేవరాజ్ హీరోగా నటించిన చిత్రం 'వైరం'. సాయి శివం జంపాన దర్శకత్వం వహించిన ఈ మూవీలో మోనాల్ హీరోయిన్. యువాన్స్ నాయుడు సమర్పణలో తెలుగు, కన్నడ భాషల్లో జె. మల్లికార్జున నిర్మించారు. నటులు దేవరాజ్, చంద్ర దేవరాజ్ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, నటులు బెనర్జీ, కాశీ విశ్వనాథ్ 'వైరం' టీజర్‌ను విడుదల చేశారు. దేవరాజ్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులు నన్నెంతో ఆదరించారు. హీరోగా వస్తున్న నా కుమారుడు ప్రణమ్‌ని కూడా ఆదరించాలి'' అన్నారు. ''త్వరలో మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు జె. మల్లికార్జున. ''ఈ సినిమా బాగా వచ్చింది'' అన్నారు సాయి శివన్ జంపాన. ఈ చిత్రానికి సహనిర్మాత: శీలం త్రివిక్రమ్ రావు, అరిపిరాల కళ్యాణ్ శాస్త్రి, సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: సామల భాస్కర్.